
Licensed to post without Prepayment No. J/Nellore/003/15-17 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03

నెల్లూరు, 09.12.2016, శుక్రవారం సంపుటి : 36 సంచిక : 27 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

www.lawyerteluguweekly.com




కొనసాగుతున్న...

## విజయయాత్ర

పిఎస్ఎల్‌వి-సి36 సక్సెస్

(వివరాలు 12వ పేజీలో)



మనసులు గెలిచి... చరితలో నిలిచి...

# తరలి వెడలె తలైవి

- మృత్యువుకు తలొంచిన జయలలిత
- 75రోజుల మృత్యుపోరాటానికి ముగింపు
- విప్లవ నాయకికి తుదివీడ్కోలు
- కన్నీరు మున్నీరైన తమిళనాడు
- గురువు ఎంజిఆర్ సమాధి పక్కనే శాశ్వత స్థానం
- తమిళ సీఎంగా నమ్మినబంటు పన్నీరు

ఒక గుండె ఆగింది... కోట్ల గుండెలు రోదించాయి.
ఒక శ్వాస ఆగింది... కోట్లాదిజనం ఆశలు గల్లంతయ్యాయి.
రెండుకళ్లు మూత పడ్డాయి... కోట్ల కళ్లు కన్నీరు కార్చాయి.
ఒక ధృవతార నేలను వీడి నింగికి చేరింది...
కోట్లాది మంది అభిమానుల రోదనలు నేల నుండి నింగిని తాకాయి.

అమ్మా... అమ్మా... అంటూ అరచిన ఆ కోట్ల గొంతుకల వేదనను భగవంతుడు మన్నించలేదు. మీకేనా అమ్మ... నాకు మాత్రం 'అమ్మ' అక్కర లేదా అంటూ వ్యక్తిగత జీవితంలో 'అమ్మ' కాలేకపోయినా ప్రజా జీవితంలో కోట్లాదిమంది ప్రజలకు 'అమ్మ'లా నిలిచిన జయరాం జయలలితను దేవుడు తన దగ్గరకు తీసుకెళ్లాడు. అమ్మను అక్కడకు తీసుకెళ్లి తాను ఆమెకు బిడ్డలా మారి ప్రేమగా చూసుకుంటున్నాడు. (మిగతా 11వ పేజీలో)



## వెంకయ్య కీలకపాత్ర

తమిళనాడులో నెలకొన్న ఉత్కంఠ పరిణామాల నేపథ్యంలో నెల్లూరీయుడైన కేంద్రమంత్రి వెంకయ్యనాయుడు కీలకపాత్ర పోషించారు. జయలలిత ఆరోగ్యం విషమించిందని తెలియగానే ప్రధాని నరేంద్రమోడీ వెంటనే వెంకయ్యను చెన్నైకు పంపించారు. చెన్నైకు వచ్చిన వెంకయ్య ఇక్కడ పరిణామాలను ఎప్పటికప్పుడు ప్రధానికి చేరవేయడమేకాక (మిగతా 11వ పేజీలో)






రెండిట్లో ఓడిపోతే...

# మంత్రి పరువు మటాష్!

- టీడీపీకి వణుకుపుట్టిస్తున్న బీజేపీ

త్వరలోనే జరుగనున్న పట్టభద్రుల, ఉపాధ్యాయ శాసనమండలి ఎన్నికలకు తెలుగుదేశంపార్టీ పూర్తిస్థాయిలో సన్నద్ధమవుతోంది. ముఖ్యంగా వామపక్షాలకు కంచుకోటలా మారిన తూర్పు రాయలసీమ(నెల్లూరు, ప్రకాశం, చిత్తూరు) నియోజకవర్గాలలో ఈసారి ఎలాగైనా తెలుగుదేశం పార్టీ జెండా ఎగురవేయాలని చంద్రబాబు యమ ఉత్సాహంతో ఉన్నాడు. అయితే ఆటలో అరటిపండు మాదిరిగా ఎటువంటి ఎన్నికల అనుభవం లేని మంత్రి నారాయణకు ఈ రెండు నియోజకవర్గాల ఎన్నికల బాధ్యతను అప్పగించాడు. పేనుకు పెత్తనమిస్తే (మిగతా 11వ పేజీలో)

# అస్మదీయులకు ప'న్నీరు'..తస్మదీయులకు కన్నీరు!

ఆ మహాకవి వేమనే ఇప్పుదుండుంటే ..'పురుషులందు పుణ్యపురుషులు వేరయా' అన్నది కాస్తా మార్చేసి, రాజకీయములందు..నీళ్ళ రాజకీయములు వేరయా'..అని వుండేవారేమో!..ఎందుకంటే అన్ని రాజకీయాల్లోకన్నా నీళ్ళ రాజకీయాలే మిన్న అన్నట్లుగా వుంటున్నాయి నేటి జిల్లా రాజకీయాలు. అందుకే జిల్లాలో ఈ రబీ సీజన్ కాస్తా..నీళ్ళ రాజకీయాల సీజన్‌గా మారిపోయింది. పంటపొలాల సాగులో కూడా ఇప్పుడు అధికారపక్ష పొలాలు..ప్రతిపక్ష పొలాలు అన్నట్లుగా సీన్ మారిపోతున్నట్లుందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. 'నారు ఒకటే అయినా..నీరు వేరయా' అంటున్నాయి తాజా రాజకీయాలు. ఈ నేపథ్యంలో అధికారపక్షం ప్రాంతంవారికి పుష్కలంగా గంగ..ప్రతిపక్షప్రాంతం వారికి తీరని బెంగ..మిగిలిందని సాగునీరందని రైతన్నలు కన్నీరు పెడుతున్నారు.

- జిల్లాలో జోరుగా 'సాగు'తున్న..'నీళ్ళ రాజకీయాలు'
- ఒకవైపు పచ్చని పొలాలు..మరోవైపు బీడువారిన భూములు



అభివృద్ధి అంటే ఎక్కడైనా సరే సమగ్రాభివృద్ధి వున్నప్పుడే సాధ్యం. అధికారంలోకి వచ్చాక ప్రాంతాల పట్టింపు వుండకూడదు. ఓటేసినా వేయకున్నా..గెలిచాక నాయకులు ప్రజలందరినీ సమభావంతోనే చూడాలి. ఏదో కక్ష కట్టినట్లు.. అవతలి వారికి ఓటేశారు కనుక వారికి నీళ్ళివ్వం.. కరెంటివ్వం అన్నట్లుగా ప్రవర్తించి వారిని క్షోభపెట్టడం ఏనాటికీ సమంజసం కాదు. పార్టీ ఏదైనా సరే, గెలిచాక అందరికీ న్యాయం చేయాలి. తాము ఓట్లేయకున్నా తమకు అన్యాయం చేయని నాయకులను ప్రజలు ఎప్పుడూ మంచిగానే గుర్తుపెట్టుకుంటారు. ఆ నిజం గ్రహించగలిగితే ఇప్పుడే కాదు, ఎప్పటికైనా ఆ మంచి నాయకులకు మంచి ఫలితాలే వస్తాయి. అయితే, జిల్లాలో మాత్రం అలాంటి న్యాయం బాగా లోపిస్తున్నట్లు కనిపిస్తోంది. ఒకే జలాశయం నుంచి వచ్చే కాలువల గుండా ప్రవహించే నీరు..అధికారపక్షం ప్రాంతాల్లోకి జోరుగా ప్రవహించడం, ప్రతిపక్ష ప్రాంతాల వద్దకు వచ్చేసరికి మూతి ముడుచుకుని మరోదారి మళ్ళిపోవడం.. ఎంతైనా అన్యాయమేనంటున్నారు రైతన్నలు. జిల్లాలో ముఖ్యంగా నెల్లూరు, నెల్లూరు రూరల్, ఆత్మకూరు, సర్వేపల్లి, సూళ్ళూరుపేట, కావలి నియోజకవర్గాల్లో వైఎస్సార్సీపి గెలిచింది కనుక, పాలకపక్షం వారు ఈ నియోజకవర్గ ప్రజలకు అందివ్వాల్సిన సౌకర్యాల విషయంలో నామమాత్రంగానే వ్యవహరిస్తున్నారనేది ప్రతిపక్షం వారి విమర్శ. అందులో భాగంగానే ఈ రబీ సీజన్‌లో సోమశిల జలాశయంలో పుష్కలంగా నీరున్నా, వరి వేసుకున్న ప్రతిపక్షప్రాంత రైతాంగానికి.. ముఖ్యంగా అనేక గ్రామీణప్రాంతాల ఆయకట్టుదారులకు సాగునీరు సరిగ్గా అందడం లేదన్నది వారి ప్రధాన ఆరోపణ. నెల్లూరు రూరల్ నియోజకవర్గానికి సంబంధించిన అనేక గ్రామాల్లో పొలాలు నీరందక బీడుపడిపోతున్నాయని, నార్లకు నీరందక నోళ్ళెండబెడుతున్నాయని, అయినా అధికారవర్గాలకి ఈ విషయం తెలిసినా నిమ్మకు నీరెత్తినట్లు వుంటున్నారే తప్ప స్పందించకపోవడంలో అంతరార్ధం ఏమిటని ఆయా గ్రామాల్లోని చిన్న, సన్నకారు రైతులందరూ తీవ్రఆవేదనతో అంటున్నారు. వైఎస్సార్సీపి ఇక్కడ గెలిచింది కనుక, పాలకులు సాగునీరివ్వకుండా ఇబ్బందిపెడుతున్నారనే ఆవేదన అందరిలోనూ కనిపిస్తోంది. రూరల్‌లోని ఓగూరుపాడు, అక్కచెరువుపాడు, చెముదుగుంట, కంసాలగుంట, అంబాపురం తదితర 50గ్రామాల్లో చెరువులకు ఈ రబీలో సక్రమంగా సాగునీరందలేదని, చెరువుల్లో నీరు లేకపోవడం, వానలు కురవకపోవడంతో వేసుకున్న నార్లు ఎండిపోతున్నాయని రైతులు లబోదిబోమంటున్నారు. అదేవిధంగా ఇతర ప్రతిపక్ష నియోజకవర్గాల్లోనూ ఇదే దుస్థితి దాపురించిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అస్మదీయులకు ప'న్నీరు'.. తస్మదీయులకు కన్నీరు అన్నట్లుగా, అధికారపక్షానికి ఓట్లేసిన ప్రాంతాలకి సాగునీరు పుష్కలంగా అందుతున్నాయని, ప్రతిపక్ష నాయకులు గెలిచిన ప్రాంతాల్లో.. ఇక భవిష్యత్తులో వారికి గెలుపన్నదే లేకుండా వుండాలని కాబోలు.. చుక్క నీరందించకుండా పంటపొలాలను ఎండబెట్టేస్తున్నారని, ఇదెక్కడి న్యాయమని ఆయా ప్రాంతాల రైతన్నల ఆవేదన.

ఇదేమి న్యాయం? అని ఎవరేనా ఆవేదనతో ప్రశ్నిస్తే, ప్రస్తుతానికింతే సరిపెట్టుకోండి. సీజన్ అయిపోగానే నీళ్ళేమైనా మిగిలితే ఇచ్చేందుకు చూస్తాంలే అని అధికారులు తాపీగా అంటున్నారని మరి కొందరి రైతుల వేదన. జిల్లా కలెక్టర్ వంటి ఉన్నతాధికారులైనా ఈ దుస్థితిని గమనించి, స్వపక్షం-విపక్షం అనే వివక్ష లేకుండా అన్నిప్రాంతాల రైతులందరికీ సాగునీరు సమంగా అందించాలని వారి విజ్ఞాపన. అనేకగ్రామాల్లో ఒక్క పంట పొలాలకే కాదు, సాగునీరు కూడా లేకపోవడంతో వేలాది మూగజీవాలకు తాగునీరు లేకుండా పోయిందని, ఆ జీవాల పరిస్థితి అత్యంత దయనీయంగా వుందని పశుపోషకులు, రైతులు వాటి అవస్తలు చూసి కన్నీరు పెడుతున్నారు. కనీసం మానవతా దృక్పధంతోనైనా అధికారులు స్పందించి, వెంటనే అన్ని ప్రాంతాలకు అవసరమైన సాగునీటిని పంపకం చేయాలని, ఈ రబీసీజన్ ముగియకముందే సాగునీరందని ప్రాంతాలకు సాగునీరందించి రైతాంగాన్ని, పాడిపశువులను, మూగజీవాలను ఆదుకోవాలని రైతులు కోరుకుంటున్నారు.

## అందరికీ న్యాయం చేయాలన్నదే మా అభ్యర్ధన

**- వైఎస్సార్సీపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి కొరపాటి మురళీనాయుడు**



వర్షాభావం ఒకవైపు.. సాగునీరు అందని దుస్థితి మరో వైపు. రబీ సీజన్ చకచకా దాటిపోతున్న పరిస్థితి ఇంకొకవైపు. ఇప్పటికే అనేక ప్రాంతాల్లో రైతులు ఎకరాకు మూడువేల దాకా ఖర్చుపెట్టి దుక్కులు వేసుకునేందుకు జీలగలు, జనుము వేసుకుని దుక్కులకు సిద్ధంగా వున్నారు. మరికొందరు వర్షాలొస్తాయి..లేకుంటే సాగునీరు వస్తుంది కదా అని ఆశపడి నార్లు కూడా వేసుకున్నారు. ఇప్పుడు వానలూ లేవు..సాగునీరూ అందడం లేదు. దీంతో రైతులు డీలా పడిపోతున్నారు. ముఖ్యంగా సోమశిల రిజర్వాయర్ నుంచి కనుపూరు కాలువ కింద వున్న అనేకగ్రామాల ఆయకట్టుదారులంతా తమకు సాగునీరు అందడం లేదని తీవ్ర ఆవేదనలో వున్నారు. ఈ కాలువ నుంచి సబ్‌లింక్‌ల ద్వారా ఎన్నో గ్రామాలకు సాగునీరు అందించాల్సి వున్నా, అధికారులు చూసీచూడనట్లు వుంటున్నారని రైతులు బాధపడుతున్నారు. జిల్లాలో కొన్ని గ్రామాల్లో నీరు లేక పొలాలు వెలవెలబోతుంటే.. మరికొన్ని ప్రాంతాల్లోని పొలాలు మాత్రం కళకళలాడుతున్నాయి. ఇది న్యాయమేనా?.. అందుకే, అందరికీ న్యాయం జరగాలన్నదే అధికారులకు మా విన్నపం. ఇప్పటికే అనేక గ్రామాల్లో తాగేందుకు చుక్కనీరు కూడా దొరక్క మూగజీవాలు దయనీయస్థితిలో వున్నాయి. సోమశిల జలాశయంలో నీరు దండిగానే వున్నా, అనేక గ్రామాలకు మాత్రం సాగునీరు సక్రమంగా అందుబాటులోకి రాకపోవడమే బాధాకరం. రబీ సీజన్ త్వరలో ముగియనున్న ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం వెంటనే ఈ పరిస్థితులను చక్కదిద్దేందుకు కృషి చేయాలి. జిల్లా కలెక్టర్ తదితర ఉన్నతాధికారులు వెంటనే ఈ సమస్యలను పరిశీలించి అన్నదాతలందరికీ సాగునీరందేలా తక్షణచర్యలు తీసుకుని, సన్న, చిన్నకారు రైతులందరికీ న్యాయం చేయాలన్నదే మా అభ్యర్ధన.

## 'తెల్ల'కాకి

**- చిన్ని నారాయణరావు**
**9440202942**

నల్లకాకుల్ని పట్టుకోండి
తెల్లరంగు వేసేయండి
ఎవరేమి చెప్పినా ఖాతరు
చేయకండి
రాజుగారి హుకుం జారీ!
జాగీరులోని సైన్యం
అప్రమత్తం
రాజుగారి మాటలు కాకులు
మాటున విన్నాయి
ఒక్కసారిగా 'కావ్' 'కావ్' మంటూ
రౌండ్'ట్రీ' కాన్ఫరెన్స్‌లో
మాట్లాడుకొన్నాయి
'తెల్ల'ధనం కాకి ఉనికికే
ప్రమాదం అని వెలుగెత్తాయి
అందుకే కాకులన్నీ అంతు
చిక్కని రీతిలో పారిపోయాయి
కొన్ని గూళ్ళలో దొరక్కుండా
భద్రంగా దాక్కున్నాయి
కాకుల్ని పట్టడం... తెల్లరంగేయడం
ఎవరితరం?
చివరికి రాజుగారి ముఖమే
తెల్లబోయింది!

### ఆత్మకూరు ప్రభుత్వాసుపత్రిలో

## డయాలసిస్ కేంద్రం

**- రాష్ట్ర మంత్రి కామినేని**



నెల్లూరుజిల్లా ఆత్మకూరులోని నూరుపడకల ప్రభుత్వాసుపత్రిలో త్వరలో డయాలసిస్ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖమంత్రి కామినేని శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం ఆసుపత్రి వైద్యులు, జిల్లా వైద్యశాఖ అధికారులతో మంత్రులు కామినేని, నారాయణ, ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి గౌతంరెడ్డి తదితరులు కలిసి సమీక్షించారు. ఆసుపత్రిలోని సదుపాయాలను గురించి డిసిహెచ్ఎస్ డాక్టర్ సుబ్బారావు, సూపరింటెండెంట్ డాక్టర్ లలితాశేఖర్‌లను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో 19మంది డాక్టర్లున్నా ఒకరిద్దరు మాత్రమే ఉన్నారని, ముఖ్యమైన డాక్టర్లు క్వార్టర్స్‌లో ఉండేలా చర్యలు తీసుకోవాలని డిసిహెచ్ఎస్‌ను ఆదేశించారు. త్వరలో ఎన్‌టిఆర్ ఆరోగ్యశ్రీ అమలయ్యేలా చూస్తామన్నారు. మంత్రి నారాయణ మాట్లాడుతూ వైద్యులు జిల్లా కలెక్టర్‌తో ఎప్పటికప్పుడు ఆస్పత్రి నిర్వహణపై సమీక్ష నిర్వహిస్తుండాలన్నారు. జిల్లా కలెక్టర్ ఆర్.ముత్యాలరాజు, ఎమ్మెల్సీలు బీద రవిచంద్ర, వాకాటి నారాయణరెడ్డి, ఎన్‌డిసిసిబి ఛైర్మెన్ ఎం.ధనుంజయరెడ్డి, మాజీమంత్రి ఆనం రామనారాయణరెడ్డి, గూటూరు కన్నబాబు, దేవరపల్లి శ్రీనివాసులురెడ్డి, కొండా వెంకటేశ్వర్లు, జి.శ్రీనివాసులురెడ్డి, జి.శ్రీనివాసులు నాయుడు, ఆంజనేయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## దేశ భవిత కోసమే ప్రధాని నిర్ణయం

**- జిల్లా బిజెపి నేత సురేంద్రరెడ్డి**

పేదల కోసం పెద్దనోట్లు రద్దుచేస్తూ ప్రధాని తీసుకున్న నిర్ణయం దేశ భవిత కోసమేనని, ఈ నిర్ణయం ఎంతో హర్షదాయకమని, దేశాన్ని నగదు రహిత లావాదేవీల దేశంగా మార్పుచేసేందుకు ప్రధాని నరేంద్రమోడీ నిరంతరం కృషిచేస్తున్నారని బిజెపి జిల్లా అధ్యక్షుడు పి.సురేంద్రరెడ్డి అన్నారు. ఈనెల3న నెల్లూరు బిజెపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, వ్యవస్థలో మేలైన మార్పులు తీసుకువచ్చేందుకు ప్రభుత్వం చేస్తున్న కృషిలో ప్రజలకు చిన్నచిన్న ఇబ్బందులు కలిగినా పట్టించుకోవద్దన్నారు. ఆన్‌లైన్ బ్యాంకింగ్ సేవలను వినియోగించుకోవడం ఎంతో శ్రేయస్కరమని, ఒకవేళ ఆ విధానం ఎవరికైనా తెలియకుంటే తమ పార్టీ జిల్లా కార్యాలయంలోని 0861- 234331కు ఫోన్ చేసి ఆ వివరాలు తెలుసుకోవచ్చని సూచించారు.

## జాతీయ పోటీలకు రెండు సైన్స్ ప్రాజెక్ట్‌లు

రాష్ట్ర శాస్త్ర సాంకేతిక మండలి ఆధ్వర్యంలో ఈ నెల 3, 4తేదీల్లో విజయవాడలో జరిగిన 24వ రాష్ట్ర స్థాయి బాలల సైన్స్ కాంగ్రెస్ పోటీల్లో నెల్లూరుజిల్లా నుంచి రెండు ప్రాజెక్ట్‌లు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాయని నెల్లూరుజిల్లా విద్యాశాఖాధికారి మువ్వా రామలింగం ఆదివారం తెలిపారు. బుచ్చిరెడ్డిపాలెం మండలం పెనుబల్లి జడ్పీ పాఠశాల నుంచి పి.భవిజ్ఞ సమర్పించిన జీవామృతంతో పర్యావరణహిత వ్యవసాయం ప్రాజెక్టు, సూళ్ళూరుపేట మండలం రాగన్నపట్టెడ జడ్పీ పాఠశాలకు చెందిన ఎ.చెంచయ్య ప్రదర్శించిన భూగర్భ జలాలపై మైక్రో వాటర్‌షెడ్ ప్రభావం అనే ప్రాజెక్టులు జాతీయ స్థాయికి ఎంపికయ్యాయని తెలిపారు.

# వరుణుడి కరుణ కోసం!



జిల్లాలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. నవంబర్ నెలలో వర్షాలు పడలేదు. డిసెంబర్‌లో కూడా పడకుంటే ప్రజల ఆశలు గల్లంతే! కాని ఎప్పుడు కావాలంటే అప్పుడు వర్షాలు కురిపించేంతగా సైన్స్ అభివృద్ధి కాలేదు. అందుకు మనముందున్న మార్గం దేవుడిని నమ్ముకోవడం. వరుణ దేవుడిని వేడుకోవడమే! ఈ పనే చేశారు ఎమ్మెల్సీ సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, సర్వేపల్లి డిస్ట్రిబ్యూటరీ అధ్యక్షులు ఈదూరు రామ్మోహన్‌రెడ్డి, తెలుగుదేశం నాయకులు ఏకొల్లు కోదండరామయ్యలు.

ఈ నెల 7వ తేదీన ముత్తుకూరు మండలం కృష్ణపట్నంలోని శ్రీకామాక్షి సమేత సిద్దేశ్వరాలయంలో వరుణయాగం నిర్వహించారు. గణపతి పూజతో సోమిరెడ్డి యాగం ప్రారంభించగా, నూతలపాటి సుబ్బయ్య శాస్త్రి ఆధ్వర్యంలో 50మంది వేదపండితులు యాగంలో పాల్గొన్నారు. ఈ క్రమంలో పంచగవ్యప్రాశన, శతరుద్రపారాయణం, రుద్రయాగం, వాస్తు, శాంతి హోమాలు నిర్వహించారు. మహాపూర్ణాహుతి అనంతరం పూజలు నిర్వహించి వరుణయాగం ముగించారు. రాష్ట్ర రవాణాశాఖ మంత్రి సిద్ధా రాఘవరావు కామాక్షి, సిద్దేశ్వరస్వామిలకు పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, మాజీమంత్రి ఆదాల ప్రభాకర్‌రెడ్డి, విజయ డెయిరీ ఛైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, తెలుగుదేశం పార్టీ జిల్లా అధికార ప్రతినిధి డాక్టర్ జడ్.శివప్రసాద్, నెల్లూరు ఏఎంసి ఛైర్మన్ ఎం.రవికుమార్‌రెడ్డి, మంత్రి ఓఎస్‌డి సి.హెచ్.పెంచలరెడ్డి, ఆర్డీఓ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## తెరపై 'జనగణమణ'



అన్ని సినిమా థియేటర్లలో సినిమా ప్రదర్శన ముందు జాతీయ గీతాన్ని తప్పని సరిగా ఆలపించాలన్న సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు నెల్లూరులోని ఎస్2 థియేటర్లలో ప్రతి షోకి ముందు జాతీయ గీతాన్ని ఆలపిస్తున్నారు. సుప్రీంకోర్టు ఆదేశాలను తమ థియేటర్లలో తూచా తప్పకుండా ఆచరిస్తున్నామని ఎస్2 మేనేజర్ మాగుంట ఆదిత్యరెడ్డి తెలిపారు.

## • సమర్థతకు సత్కారం...

# అనిల్‌రెడ్డికి జీవిత సాఫల్య పురస్కారం



***అట్టపెట్టెలు తయారుచేసే పారిశ్రామికవేత్తగానే కాకుండా, మంచి స్నేహబాంధవ్యాలు కలిగిన వ్యక్తిగా ఎక్కడ ఏ మంచి కార్యక్రమం జరుగుతున్నా అన్నీ తానే అయ్యి అంతటా తానేగా కార్యక్రమ భారాన్ని తన భుజస్కంధాలపై వేసుకుని అది విజయవంతం అయ్యేవరకు శ్రమించే గుణమున్న అజాతశత్రువు, స్నేహశీలి, కార్యశూరుడు కాకుటూరు అనిల్‌కుమార్‌రెడ్డి.***

స్వస్థలం నెల్లూరుజిల్లా మినగల్లైనా ఆయన స్థిరనివాసం చెన్నైలో. అఖిలభారత అట్టపెట్టెల తయారీదారుల ఫెడరేషన్‌కి అనిల్‌కుమార్‌రెడ్డి మాజీ అధ్యక్షుడు. ఇటీవల చండీఘర్‌లో జరిగిన ఫెడరేషన్ 45వ జాతీయ సమావేశంలో అట్టపెట్టెల తయారీ రంగంలో అనిల్‌రెడ్డి చేసిన విశేష కృషికి గుర్తుగా ఆయనను "జీవిత సాఫల్య పురస్కారం"తో సత్కరించారు. హిమాచల్‌ప్రదేశ్ గవర్నర్ ఆచార్య దేవ్‌వ్రత్‌జీ అనిల్‌కుమార్‌రెడ్డికి "జీవిత సాఫల్య పురస్కారాన్ని" అందించారు. హిమాచల్ ప్రదేశ్‌లో అట్టపెట్టెల తయారీదారుల ఫెడరేషన్ శాఖను ప్రారంభించడంలో కూడా అనిల్‌కుమార్‌రెడ్డిదే కీలకపాత్ర.

తన చేతులమీదుగా ఎన్నో ఫెడరేషన్ సమావేశాలను అవలీలగా నిర్వహించిన అనుభవంతో చండీఘర్‌లో జరిగిన 45వ జాతీయ సమావేశాన్ని కూడా సలహాదారు హోదాలో విజయవంతం చేయడంలో కీలకపాత్ర పోషించినందుకుగాను అనిల్‌రెడ్డిని ప్రత్యేక ప్రోత్సాహక అవార్డుతో కూడా ఇదే వేదికపైన సన్మానించడం విశేషం. ఈ అవార్డు ఆ రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి మనీష్ అగ్నిహోత్ర చేతుల మీదుగా అనిల్‌కుమార్‌రెడ్డి అందుకున్నారు.





కేవలం ఒక పారిశ్రామికవేత్తగానే కాకుండా సామాజిక స్పృహ వున్న వ్యక్తిగా, అనేక సాహిత్య సాంస్కృతిక, సేవా సంస్థలలో కీలకపాత్ర పోషిస్తూ అందరివాడుగా పిలిపించుకుంటున్న అనిల్‌కుమార్‌రెడ్డి గతంలో "స్పెషల్ అచీవ్‌మెంట్ అవార్డు", "హర్లాక అవార్డు", జాతీయ స్థాయిలో అందించే "ఉద్యోగ్‌పత్రా అవార్డు", స్థానిక దక్షిణ భారతం తరపున సౌత్ ఇండియా ఛాంబర్ వారిచే "బిజినెస్ లీడర్‌షిప్ అవార్డు" వంటివి అనేకం తన సొంతం చేసుకున్నారు.

తన విస్తృత సేవల ద్వారా మంచి గుర్తింపుతో పాటు అత్యధిక అవార్డులు సాధించిన వ్యక్తిగా విశేష సమర్థత కలిగిన నాయకుడిగా అంతర్జాతీయ అట్టపెట్టెల సంఘం యు.యస్.ఏ సభ్యుడిగా యావత్ భారతదేశం నుండి నామినేట్ కాబడిన ఏకైక వ్యక్తి అనిల్‌కుమార్‌రెడ్డి.

ఓవైపు వ్యాపారానికి మరోవైపు సమాజానికి సమాన ప్రాధాన్యతనిస్తూ తన ప్రస్థానాన్ని విజయపథంలో సాగిస్తున్న అనిల్‌రెడ్డికి 'లాయర్' అభినందనలు.

## జనం మెచ్చిన నాయకురాలు...

# నెల్లూరుకు మాత్రం మనుమరాలు

## జయకు నెల్లూరుతో అనుబంధం

***తిరిగిరాని లోకాలకు తరలి వెళ్లిన పురచ్చితలైవి కుమారి జె.జయలలితకు నెల్లూరు నగరంతో విడదీయరాని అనుబంధం ఉంది. ఆమె జనం మెచ్చిన నాయకురాలే కాదు, నెల్లూరుకు మనుమరాలు కూడా!***

నెల్లూరుతో ఆమెది విడదీయరాని బంధం. రంగనాథుడి గుడి, అక్కడే వున్న చిత్రకూటం, పక్కనేవున్న పెన్నానది, తిక్కన పార్కు జయలలిత జీవిత చరిత్రలో మరపురాని జ్ఞాపకాలు. జయలలిత తల్లి సంధ్య సినీనటి! ఆమె సొంతూరు నెల్లూరే! రంగనాయకులపేటలోని చిత్రకూటం వద్ద వారిల్లుండేది. నెల్లూరులో వున్నప్పుడే సంధ్య సినీ పరిశ్రమలోకి వెళ్లారు. అప్పుడే మైసూరు రాజా ఆస్థానంలో వైద్యుడిగా పనిచేస్తున్న జయరామన్‌ను ఆమె వివాహమాడారు. వారికి జయలలిత జన్మించింది. సంధ్య అత్తమామలు కర్నాటకలోని శ్రీరంగంలో ఉండేవారు. సంధ్య సినిమాలలో బిజీగా వున్న సమయంలో ఆమె భర్త మరణించారు. ఆ సమయంలో ఒకటిన్నర ఏడాది వయసున్న జయలలితను ఆమె నెల్లూరులోని తన తల్లి వద్ద వుంచింది. అలా 5ఏళ్ల వయసొచ్చే దాకా జయలలిత నెల్లూరులోనే పెరిగింది. ఆ తర్వాత చెన్నైకు వెళ్లినా సెలవుల సమయంలో నెల్లూరొచ్చి తన మేనమామల వద్ద గడిపేది. చిత్రకూటం ప్రాంతంలో చిన్నతనంలో జయలలితకు చాలామంది స్నేహితులుండేవాళ్లు. ఈ ప్రాంతాల్లో తోటి స్నేహితులతో కలిసి ఆమె సరదాగా ఆడుకునేది. రంగనాథ స్వామి ఆలయంకు క్రమం తప్పకుండా వెళుతుండేది. జయలలిత సినిమాల్లోకి వెళ్లాక నెల్లూరుకు రావడం మానేసింది.



నెల్లూరు చిత్రకూటంలో చిన్నప్పుడు జయలలిత వున్న ఇల్లు

## నెల్లూరీయులతో సత్సంబంధాలు

నెల్లూరుతో వున్న ప్రత్యేక అనుబంధమో ఏమోగాని నెల్లూరుకు చెందిన వ్యక్తులను ఆమె ఎంతగానో అభిమానించేవారు. ముఖ్యంగా స్వర్గీయ మాగుంట సుబ్బరామిరెడ్డి కుటుంబానికి ఆమె అత్యంత ఆప్తురాలు. 1992లో నెల్లూరు ఏ.సి స్టేడియంలో జరిగిన మాగుంట సుబ్బరామిరెడ్డి తనయుడు మాగుంట విజయ్‌రెడ్డి వివాహానికి ఆమె రావడం జరిగింది. 1995లో నక్సలైట్ల చేతుల్లో మాగుంట సుబ్బరామిరెడ్డి దారుణహత్యకు గురైనప్పుడు కూడా ఆమె నెల్లూరొచ్చి సుబ్బరామన్నకు నివాళులర్పించారు. అలాగే తమిళనాట తెలుగువారి కీర్తి బావుటాగా వున్న ప్రముఖ వైద్యులు డాక్టర్ సి.ఎం.కె.రెడ్డి, సీట్రోన్ అధినేత సుబ్బారెడ్డి లాంటి నెల్లూరీయులతోనూ ఆమెకు సత్సంబంధాలున్నాయి. ఇలా నెల్లూరుతోనూ, నెల్లూరీయులతోనూ జయలలితకు వున్న అనుబంధం చరిత్రలో తీపిజ్ఞాపకంగా మిగిలిపోనుంది.

# కాంట్రాక్ట్ లెక్చరర్లను క్రమబద్ధీకరించాలి

**- కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి**



రాష్ట్ర ప్రభుత్వం కాంట్రాక్ట్ లెక్చరర్లను క్రమబద్ధీకరించే దిశగా చర్యలు తీసుకోవాలని నెల్లూరురూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం నెల్లూరు కలెక్టరేట్ ఎదుట ఏపి ప్రభుత్వ కాంట్రాక్ట్ లెక్చరర్ల జేఏసి ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్, డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాలల అధ్యాపకులు చేపట్టిన సమ్మెకు కోటంరెడ్డి సంఘీభావం తెలిపి దీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం చంద్రబాబు రాష్ట్రం లోటుబడ్జెట్‌లో ఉందంటూనే ప్రజాధనాన్ని అనవసర ఖర్చులతో వృధా చేస్తున్నారని ఆరోపించారు. ప్రజాప్రతినిధులకు వేతనాలు పెంచడం, ప్రచార్భాటాలకు నిధులను ఖర్చుచేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. అనంతరం జేఏసి నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం దిగొచ్చేంత వరకు ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు. జేఏసి నాయకులు నాగేంద్ర ప్రసాద్, ఉమాశంకర్, కల్లూరి శ్రీనివాస్, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు

## 'ప్రభా'తం

# నింగికెగసిన నిప్పుకణం



**తమిళనాడు ముఖ్యమంత్రి, అన్నాడిఎంకె అధినేత్రి జయలలిత మృతి తమిళనాడును శోకసాగరంలో ముంచివేసింది. కోట్లాది మంది ప్రజల ఆరాధ్యదైవంగా, 'అమ్మ'గా అందరి అభిమానం పొందిన జయలలిత మరణం అందరికీ తీరనిశోకం మిగిల్చింది. కృషికి.. పట్టుదలకు, అంతులేని ఆత్మవిశ్వాసానికి ఆమె పెట్టింది పేరు. విశిష్టమైన నటిగానే కాక, ప్రజాహృదయ నేతగా, ధీరోదాత్తనాయకురాలిగా, విప్లవనాయకిగా.. సంచలనాలకే మారుపేరుగా విఖ్యాతిచెంది.. ఆమె అందరికీ స్ఫూర్తిగా నిలిచారు.**

ఒక వీరవనిత..మౌనంగా..ధీరగంభీరంగా ఆకాశంవైపు అడుగులు వేసుకుంటూ వెళ్లిపోయింది. అవలీలగా అవనిని దాటుకుని ఆవలితీరాలకు మళ్లిపోయింది. మహోజ్వల జ్వాలగా ఎగిసిన ఒక నిప్పుకణం..మండుతూనే నింగికెగిసి శూన్యంలో కలసిపోయింది. ఒక ధృవతార..నిశ్శబ్ధంగా నేల రాలిపోయింది. ఏటికెదురీది నిలిచిన ఆ అసాధారణ మహిళ..సవాళ్ళకే సవాల్ విసిరే పోరాటయోధురాలు.. ఏళ్ళతరబడి అలుపెరగక అవిశ్రాంతంగా పోరాడిన విప్లవనాయకి..విశ్రమించింది. జీవితంలోనూ, రాజకీయాల్లోనూ ఎన్నెన్నో పోరాటాలు చేసిన ఆ ధీరవనిత..శాశ్వత నిద్రలోకి నిష్క్రమించింది.

అమ్మ.. ఇక లేరు. అమ్మ..అస్తమించింది.

తమిళనాట మహారాణిగా అవతరించి.. తన అపారమైన సేవలతో తమిళ ప్రజల గుండెల్లో ఆరాధ్యదైవంగా ప్రకాశించిన 'అమ్మ'..అన్నా డిఎంకె అధినేత్రి..తమిళనాడు ముఖ్యమంత్రి జయలలిత తీవ్రఅస్వస్థతతో..గుండెపోటుతో తనువు చాలించారు. దాదాపు 70రోజులుగా ఆమె మృత్యువుతో పోరాడారు. చెన్నైలోని అపోలో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఈ నెల 5వ తేది రాత్రి 11.30 గంటలకు మరణించినట్లు వైద్యులు ప్రకటించారు. పక్కరోజున ఎంజిఆర్ సమాధి పక్కనే ఆమె అంత్యక్రియలు జరిగాయి. జయలలిత మృతితో దేశప్రజలంతా ఒక్కసారిగా అవాక్కయ్యారు. ఆ వీరనారిని తలచుకుని కంటతడిపెట్టారు. అమ్మ..ఇక లేదనే బాధతో తమిళనాడు భోరుమని విలపించింది. తల్లిని కోల్పోయిన పిల్లల్లా తమిళ ప్రజలు విలవిలలాడిపోయారు. ఆమె అంత్యక్రియలకు లక్షలాది ప్రజలంతా కన్నీటితో తరలిరావడంతో మెరీనాబీచ్ కన్నీటి సంద్రమే అయింది. అంతటి ప్రజాభిమానాన్ని మూటగట్టుకుని, దేశప్రజలకు..ముఖ్యంగా తమిళప్రజలకు తీరని శోకం మిగిల్చి.. ఇక ఏ శోకాలూ.. శాపాలూ లేని సామ్రాజ్యానికి అధిదేవతగా వుండేందుకు... 'అమ్మ' అదే ధీరగంభీరంతో వెళ్ళిపోయింది. ఈ లోకానికే.. ఇక సెలవంటూ తరలిపోయింది.

జీవితంలో ఎన్నో పార్శ్వాలుంటాయి. జయలలిత జీవితంలోనూ అంతే. పుట్టినప్పటినుంచీ ఎన్ని కష్టాలెదురైనా చివరికి అన్నిటిలోనూ స్వయంకృషితో విజయమే సాధించింది. పదోతరగతి చదువుతూ రాష్ట్రంలోనే ఫస్ట్‌గా నిలచింది. బహుముఖ ప్రజ్ఞాశాలిగా ఎదిగింది. సినీరంగంలో ప్రముఖనటిగా రాణించింది. రాజకీయరంగంలో మహారాణిగా నిలచింది. కృషి, పట్టుదల, అంతులేని ఆత్మవిశ్వాసం, ఎన్నెన్ని సవాళ్ళు..సమస్యలు.. అడ్డంకులెదురైనా సరే..ధీటుగా ఎదుర్కోవడం..ముమ్ముందుకు సాగిపోవడమే ఆమె నైజం. ఎక్కడా రాజీపడే ప్రసక్తే లేదు. ఒకవేళ ఆ పోరాటంలో అపజయం ఎదురైనాసరే.. తలవంచే తత్వం అసలే వుండదు. ఆత్మవిశ్వాసంతో విజయం సాధించేదాకా పోరాడుతూనే వుండడమే కర్తవ్యం. అలాంటి ధీరలక్షణాలన్నీ పుష్కలంగా వున్న ధీమణి..మహిళామణి జయలలిత. ఇప్పుడే కాదు, చిన్నప్పటి నుంచీ ఆమె మనస్తత్వం అంతే. పట్టుదలకు ఆమె మారుపేరు. ఎంజిఆర్ సహకారంతో రాజకీయాల్లోకి వచ్చి, ఆయన మరణం తర్వాత సొంతపార్టీలోనే అవమానాలు ఎదురైనా సహించారు. ఆ తర్వాత శాసనసభ ఎన్నికల్లో నిలచి గెలచి..తొలి మహిళా ప్రతిపక్ష నాయకురాలిగా తన సత్తా చూపారు. అంతేకాదు, అప్పట్లో అధికారపక్షంగా వున్న డిఎంకె చేతుల్లో ఎన్నో అవమానాల పాలైనా.. నిండుసభలో పరాభవం ఎదురైనా..ఇక ముఖ్యమంత్రిగానే ఈ సభలో అడుగు పెడతానంటూ శపథం చేసి వెళ్ళి పోయి.. చివరికి అన్నంత పనీ సాధించి.. 'జయ' అంటే ఏమిటో నిరూపించుకున్నారు.అంతటి ధీరోదాత్త.. వీరనారీమణి ఆమె. అవినీతి-అక్రమాస్తుల కేసుల్లో జైలుకి వెళ్లినా సంయమనం కోల్పోకుండా..పాలనపై ఏమాత్రం పట్టుతగ్గిపోకుండా అన్ని చర్యలూ తీసుకున్నారు. విశిష్టమైన వ్యక్తిత్వం..విలక్షణమైన మనస్తత్వం.. అన్నిటికీ మించి అసాధారణ నాయకత్వ పటిమ..ఆమెను అత్యున్నతశిఖరాలకు చేర్చాయి. అటు సినీరంగంలోనూ, ఇటు రాజకీయ రంగంలోనూ తిరుగులేని నాయకిగా వుండడం ఎంతో అరుదు..ప్రజాసేవారంగంలోనూ ఆమె సాధించిన స్థానం మరెవరికీ రానుగాక రాదు. ఎన్నెన్నో ప్రజాకర్షక పథకాలను అమలుచేసి తమిళప్రజల గుండెల్లో దేవతగా నిలిచారామె. కడుపారా అన్నం పెట్టే 'అమ్మ'గా ఆమె అందరికీ ఆత్మీయులయ్యారు. అత్యంత తక్కువ ధరకే పేదలకు అన్నంపెట్టే అమ్మ క్యాంటీన్స్ దగ్గర నుంచి అన్నివర్గాల ప్రజలసంక్షేమం కోసం ప్రవేశపెట్టిన అమ్మ వాటర్, అమ్మ ఇళ్లు.. అమ్మ ల్యాప్‌టాప్స్, అమ్మ బేబీ కిట్స్, అమ్మ సీడ్స్, అమ్మ ఫార్మసీస్, అమ్మ కాల్ సెంటర్స్, అమ్మ మ్యారేజ్‌హాల్స్ ఇలా ఎన్నెన్నో.. అన్నీ ప్రజల గుండెలకు హత్తుకుపోయాయి. కోట్లాది ప్రజలు ఆమెకు అభిమానులయ్యారు. ఒక్కమాటలో చెప్పాలంటే ఒక సంచలనాత్మక నాయకురాలిగా, ప్రజాహృదయనేతగా ఆమె భారతదేశ చరిత్రలోనే తనకంటూ ఒక ప్రత్యేక అధ్యాయాన్ని సృష్టించుకున్నారు. ఒక నిత్యచైతన్యకెరటంగా..ధీరోదాత్త పోరాటయోధురాలిగా.. అత్యంత సాహసికురాలిగా..మహానాయకురాలిగా, ప్రజలంతా ఆదరించే ఆదర్శమహిళగా.. 'అమ్మ'గా తన జీవితాన్ని చరితార్థం చేసుకున్నారు. జీవిత వారాశిలో ఎక్కడో పుట్టి..మహోధృత తరంగమై లేచి..పోరాటాల పెనుగాలి తాకిడికి ప్రభంజనమై వీచి..ఉరకలు పరుగులతో..పడుతూ..లేస్తూ చివరికి అలసిపోయిన కెరటం మెల్లిగా కడలిగర్భంలోనే కలసిపోయినట్లు.. ఆమె చివరికి మృత్యుఒడిలోకి ఒరిగిపోయారు.

తమిళనాట రాజకీయాలనే శాసించిన అమ్మ.. సకలజన హృదయాల్లో చైతన్యకిరణమై వెలిగిపోయిన అమ్మ.. మృత్యువుతో కూడా కడదాకా అలుపెరుగని పోరాటమే చేసింది. అందుకే.. ఆ మహానేత.. ప్రజలందరి హృదయాల్లో 'అమ్మ'గా.. ఒక దేవతగా నిలచిపోయింది. మెరీనాబీచ్ కన్నీరుపెడుతుండగా ఆశేష ప్రజల అశ్రునయనాల మధ్య ఆమె శాశ్వతంగా నిష్క్రమించినా.. ఆమె పోరాటస్ఫూర్తి.. ఆ ధీర గుణం, ఆ ప్రజా సేవానురాగం మాత్రం.. ప్రజల గుండెల్లో శాశ్వతంగా నిలిచే వుంటాయి.

## నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



మినరల్‌వాటర్ ప్లాంట్ యజమానులు నాణ్యతా ప్రమాణాలను పాటించి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడవలసిన బాధ్యత ఉందని సంయుక్త కలెక్టర్ ఏఎండి ఇంతియాజ్ పేర్కొన్నారు. ఆదివారం నెల్లూరులోని అల్లీపురంరోడ్డులోని సుప్రీమ్ ప్యాకేజ్ డ్రింకింగ్ వాటర్ ప్లాంటును తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్స్ సర్టిఫికేట్‌ను, మైక్రోబయాలజీ లేబరేటరీ, కెమికల్ లేబరేటరీని, పరిశ్రమల శాఖ అనుమతిని, ఫుడ్‌సేఫ్టీ, కమర్షియల్ టాక్స్ లైసెన్స్‌ను, రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం వాటర్ యూనిట్ తయారు చేస్తున్న వాటర్ ప్యాకెట్లను, బబుల్ క్యాన్స్‌ను, బాటిల్స్‌ను తనిఖీ చేసి వాటిపై ముద్రించిన తేదీలను పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. జిల్లాలో అనేక వాటర్‌ప్లాంట్లు ఎలాంటి అనుమతులు లేకుండా ఇష్టానుసారంగా వ్యాపారాలు చేస్తున్నాయని, అటువంటి వాటర్ ప్లాంట్లు తప్పనిసరిగా బిఐఎస్ సర్టిఫికెట్‌ను పొందాలని లేదంటే తక్షణమే వాటిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆహార పరిరక్షణాధికారి వి.ఆనందరావు, జి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

## అవినీతి నిర్మూలనకు నడుం బిగించండి!

### - ఏసిబి డిఎస్పీ పిలుపు

సమమాజంలో అవినీతి నిర్మూలనకు నడుం బిగించాలని ఏసిబి డిఎస్పీ తోట ప్రభాకర్ విద్యార్థులకు పిలుపునిచ్చారు. అవినీతి వ్యతిరేక వారోత్సవాల్లో భాగంగా ఆదివారం నెల్లూరులోని రత్నం హాస్టళ్లలో ఏసిబి అధికారులు విద్యార్థులతో అవినీతి నిర్మూలనకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చా వేదిక నిర్వహించారు. అవినీతిని అంతమొందించడంలో విద్యార్థులు, యువత ప్రధాన భూమిక పోషించాలని, ఏసిబి పనితీరు, చట్టాలను డిఎస్పీ విద్యార్థులకు వివరించారు. అనంతరం ఏసిబి డిఎస్పీ మాట్లాడుతూ ప్రభుత్వ శాఖల్లో అవినీతి రాజ్యమేలుతోందన్నారు. లంచం తీసుకోవడమే కాదు, లంచం ఇవ్వడం కూడా నేరమనే విషయాన్ని ప్రతిఒక్కరూ గుర్తుంచుకోవాలన్నారు. ప్రభుత్వ శాఖల్లో ఎవరైనా లంచం అడిగితే నేరుగా తమకు ఫిర్యాదు చేస్తే అవినీతి అధికారుల ఆట కట్టిస్తామన్నారు. అవినీతి నిర్మూలన యువత లక్ష్యం కావాలన్నారు. అనంతరం విద్యార్థులతో అవినీతిని అంతమొందిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. ఏసిబి ఇన్‌స్పెక్టర్ శివ కుమార్‌రెడ్డి, ఎస్సై శ్రీహరి పాల్గొన్నారు.

## నగదు రహిత దిశగా రైతు సేవలు

నగదు రహిత లావాదేవీలు నిర్వహించుకునే దిశగా రైతులకు సేవలు విస్తరించనున్నట్లు సంయుక్త వ్యవసాయ సంచాలకులు కె.హేమమహేశ్వరరావు తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఎరువులు, పురుగు మందుల డీలర్లు తప్పనిసరిగా ఈ-పాస్ యంత్రాలను వాడాలని, జిల్లాలో దాదాపుగా 624 ఈ-పాస్ యంత్రాలను నాలుగైదు రోజుల్లో అందుబాటులోకి తేవాలని ఆదేశించారన్నారు. కావున సంబంధిత బ్యాంకు అధికారులు వీటిని అందుబాటులోకి తెస్తున్నట్లు తెలిపారు. ఇవి అందుబాటులోకి వచ్చేలోపు రైతులకు మరియు డీలర్లకు వీటి వినియోగంపై శిక్షణ ఇస్తామని, ఇకమీదట రైతులు క్రెడిట్, డెబిట్ లేదా రూపే కార్డులు ఉపయోగించి సాగుకు కావాల్సిన విత్తనాలు, ఎరువులు మరియు పురుగు మందులు సులువుగా కొనే వీలుంటుందని తెలిపారు. ఇప్పటికే మన గ్రోమోర్ సెంటర్లలో దాదాపు 390 మంది రైతులు 80లక్షల రూపాయల మేర నగదు రహిత లావాదేవీలు నిర్వహించినట్లు తెలిపారు.




## నల్ల కుబేరులకు అవకాశం

పెద్దనోట్ల రద్దు వల్ల ప్రధాని నరేంద్రమోడీ సాధిస్తున్నదేమిటో అర్థం కావడం లేదు. పెద్దనోట్ల రద్దు ప్రకటన తర్వాత బ్యాంకుల్లో నగదు డిపాజిట్‌కు 50రోజులు గడువిచ్చారు. ఈ గడువును నల్లకుబేరులు బాగా సద్వినియోగం చేసుకున్నారు. తమ దగ్గర వున్న డబ్బును ఆస్తుల రూపంలోకి మార్చుకున్నారు. బంగారంగా మలచుకున్నారు. లేదంటే తెలిసిన వారి ఖాతాలను వాడుకున్నారు. ఇన్ని రోజులు గడువివ్వడం వల్ల బ్లాక్‌మనీ పెద్దగా బయట పడలేదు.

**నగేష్.వి, నార్త్‌రాజుపాళెం.**

## జంపింగ్‌లకే ప్రాధాన్యం

తెలుగుదేశంపార్టీలో కాంగ్రెస్ నుండి వలస వచ్చిన నేతలకే ఎక్కువ ప్రాధాన్యతనిస్తున్నట్లుగా వుంది. నామినేటెడ్ పదవులు వాళ్లకే ఇచ్చారు. తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ సీటును కాంగ్రెస్ నుండి వచ్చిన వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డికే ఇచ్చారు. ఏళ్ల తరబడి తెలుగుదేశం పార్టీనే నమ్ముకుని వున్న నాయకులు, కార్యకర్తల నోట్లో మట్టికొడుతున్నారు. నెల్లూరుజిల్లా మంత్రి నారాయణ వల్లే తెలుగుదేశం పార్టీ కోసం కష్టపడ్డ వారికి ఫలితం లేకుండా పోతోంది.

**తాటిపర్తి చెన్నకేశవ, నెల్లూరు.**

## అవినీతిపరుల ఆట కట్టు

పెద్దనోట్ల రద్దు సామాన్యులకు మేలు చేస్తుంది. అవినీతిపరులు, నల్లకుబేరులు, ఉగ్రవాదుల ఆట కట్టిస్తోంది. అయితే అవినీతిపరులు లంచాలకు కొత్తదారులు వెదుక్కుంటున్నారు. లంచాల రూపంలో బంగారం, వస్తువులు, స్థలాలు డిమాండ్ చేస్తున్నారని తెలుస్తోంది. నల్లకుబేరులు చాలామంది దేవాలయ హుండీలలో నోట్ల కట్టలు వేస్తూ తమ పాపాలను కడిగేసుకుంటున్నారు. చాలా కొద్దిమంది తప్పితే ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగులు కోట్లకు పడగలెత్తి ఉన్నారు. ఇలాంటి అవినీతిపరుల ఆగడాలు ఇకనన్నా తగ్గుతాయేమో చూడాలి.

**వాస్తు రామచంద్ర, నెల్లూరు.**

## ఎస్సీ ఓట్లపై...

# వెంకయ్య గురి



***విభజించి పాలించు అన్నది మొదటినుండి కాంగ్రెస్ విధానం. కులాల వారీగా మతాల వారీగా తాయిలాలను ప్రకటించడం, వారిని ఓటు బ్యాంకుగా మలచుకోవడం కాంగ్రెస్ నైజం. బీజేపీకి తొలినుండి హిందూత్వ ఓటుబ్యాంకు తప్ప రెండో దారి లేదు. కాని, ఇటీవల పరిణామాలను చూస్తుంటే ఆ పార్టీ కూడా కులాల వారీగా ఓట్ల బ్యాంకులపై కన్నేస్తుందా? అనే అనుమానం కలుగుతోంది.***

ఇటీవల హైదరాబాద్‌లో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో జరిగిన 'ధర్మయుద్ధం' సభకు కేంద్రమంత్రి యం.వెంకయ్యానాయుడు హాజరుకావడం తెలి సిందే! తమ పార్టీ అధిష్టానం అనుమతి లేకుండా ఒక కులంవారు నిర్వహిస్తున్న సభలో వెంకయ్య పాల్గొనలేదు. ఖచ్చితంగా దీనిపై బీజేపీకి ఒక వ్యూహం ఉన్నట్లు కనపడుతోంది. దేశవ్యాప్తంగా ఎస్సీలున్నారు. వీరిలో ఒక వర్గం మెజార్టీ సభ్యులు. మరోవర్గం వారు వారికంటే తక్కువ. ఈ రెండు కులాలు కూడా ఒకే కేటగిరి క్రింద వున్నాయి. ఒక వర్గవారిలో విద్యా నైపుణ్యం ఎక్కువ. కాబట్టి రిజర్వేషన్ ఫలాలను ఎక్కువుగా వారే అనుభవిస్తున్నారని, మాకు అన్యాయం జరుగుతుందని, కాబట్టి ఎస్సీ రిజర్వేషన్‌లను విభజించాలంటూ మందా కృష్ణమాదిగ పోరాటం మొదలుపెట్టడం తెలిసిందే! ఇప్పటివరకు కేంద్రంలో, రాష్ట్రంలో వున్న ప్రభుత్వాలు దీని గురించి పట్టించుకోలేదు. ముఖ్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం దీని మీద దృష్టి పెట్టలేదు. దానికి కారణం కూడా లేకపోలేదు. కాంగ్రెస్ మొదటి నుండి కూడా ఒక వర్గం వారికి బలమైన మద్దతుదారులు. అలాగని మరో వర్గంవారు ఆ పార్టీకి వ్యతిరేకం కాదు. చాలా వరకు వాళ్లు కూడా కాంగ్రెస్‌నే బలపరుస్తూ వచ్చారు.

అయితే ఇప్పుడు కేంద్రంలో బీజేపీ వుంది. ఒక వర్గం కులస్తుల ఓట్లు ఎలాగూ తమకు పడవని వారికి తెలుసు. వర్గీకరణ జరపకపోయినంత మాత్రాన రాజకీయంగా ఆ పార్టీకి ప్రయోజనం లేదు. అదే వర్గీకరణ జరిపితే మరో వర్గంవారు బీజేపీకి బలమైన మద్దతుదారులవుతారని ఆ పార్టీ నేతల ఉద్దేశ్యం లాగుంది. అదీగాక పార్టీలో ముఖ్యనాయకులు చాలామందికి మరో వర్గం పట్ల సానుకూల దృక్పథం వుంది. దీనికి ప్రధాన కారణం ఏంటంటే ఒక వర్గంవారు అంటరానితన పోకడల మూలంగా క్రైస్తవ మతంవైపు మళ్లారు. హిందూత్వ సిద్ధాంతాన్ని విశ్వసించే బీజేపీకి ఇది మింగుడు పడదు. అదే మరోవర్గం వారు ఎక్కువుగా హిందూత్వ మూలాలున్న బౌద్ధంవైపు వైపు వెళ్లారు. బీజేపీ వాళ్లు బౌద్ధమతం స్వీకరించిన వారిని వేరుగా చూడరు. ఈ సామాజిక కోణం కూడా వారి పట్ల బీజేపీ ప్రభుత్వానికి సానుభూతి కలిగేలా చేసిందని చెప్పవచ్చు. మొత్తానికి ఎంఆర్‌పిఎస్ పోరాటం మళ్లీ మొదలు కావడం, కేంద్రమంత్రులే వారి కార్యక్రమాలకు హాజరు కావడం చూస్తుంటే... ఎస్సీ వర్గీకరణకు దారులు ఏర్పడుతున్నట్లుగానే వుంది.

బీసీలలోనూ రిజర్వేషన్ వర్గీకరణ వుంది. బీసీల జాబితాలో చాలా కులాలు న్నాయి. వీటిలోనూ వెనుకబడిన కులాలకు ప్రత్యేక ప్రయోజనాలు కల్పించడానికి బి.సి రిజర్వేషన్ వర్గీకరణ చేశారు. దీనినే ఎస్సీ రిజర్వేషన్‌లకు కూడా అమలు చేయాలని మరోవర్గం వారు కోరుతున్నారు. బీజేపీ మిత్రపక్షాలు కూడా ఈ డిమాండ్‌కు మద్దతు పలుకుతున్నాయి. కాబట్టి త్వరలోనే వెంకయ్య సారధ్యంలోనే ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ జరిగినా జరగొచ్చు!



## రియల్టర్లకు...

# 'నారాయణ' షాక్

- ఉన్న 'బ్లాక్'నంతా ఊడ్చేసిన మంత్రి
- పాతనోట్లు దొరక్క పాత అప్పులు తీర్చని రియల్టర్లు

***రాష్ట్ర మున్సిపల్ మంత్రిగా పి.నారాయణ జిల్లా ప్రజలకు ఏ విధంగానూ ఉపయోగపడడం లేదు సరికదా, ఆయన మూలంగా ప్రత్యక్షంగానో, పరోక్షంగానో కొందరికి అన్యాయం జరిగిపోతుంది.***

జిల్లాలో పెద్దనోట్ల రద్దు వ్యవహారం కూడా ఇలాంటిదే! పెద్దనోట్లు రద్దు తర్వాత జిల్లాలోనే కాకుండా ప్రకాశం జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన వ్యాపారుల వద్ద వున్న బ్లాక్‌మనీనంతా నారాయణ తీసుకున్నాడు. రద్దు నోట్ల ప్రకటన వెలువడగానే వ్యాపారులు రెండో ఆలోచన చేయకుండా నారాయణ ఇంటి ముందు 'క్యూ' కట్టి మరీ డబ్బులిచ్చారు. నేను బాధ్యతగల మంత్రిని, దేశంలో బ్లాక్‌మనీని అదుపు చేయాల్సిన పాలక యంత్రాంగంలో నేనూ ఒక సభ్యుడిని, పెద్దనోట్లు రద్దు చేస్తూ కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని అమలు చేయడంలో నా పాత్ర కూడా వుంది అని నారాయణ భావించలేదు. బ్యాగులు, బస్తాల కొద్ది డబ్బు వచ్చేసరికి నారాయణలో వున్న మంత్రి షేడ్ తొలగిపోయింది. అతనిలోని విద్యావ్యాపారి మేల్కొన్నాడు. అందినకాడికి బ్లాక్‌మనీని తీసుకున్నాడు. అతను నల్లధనం తీసుకుంటున్న సంగతి మీడియాలో రాకపోయి వుంటే ఇప్పటికి కూడా నిరభ్యంతరంగా నల్లదనం తీసుకుంటుండేవాళ్లు. నారాయణ వద్దకు మొత్తం ఎంత నల్లధనం వచ్చిందన్న దానిపై కరెక్ట్ లెక్కలేదు గాని, వ్యాపారులంతా కూడా తమ వద్దకు వచ్చిన డబ్బును నారాయణకే ఇచ్చారన్నది నిర్వివాదాంశం. నారాయణ గనుకే ఈ బ్లాక్‌మనీని తీసుకోకపోయినట్లైతే చాలామంది రియల్టర్లు కోలుకునేవాళ్లు. వడ్డీ వ్యాపారులందరూ కూడా రియల్టర్ల వద్దవున్న స్థలాలు, భూములను తక్కువ రేటుకు కొనడమో, లేదా తాకట్టు పెట్టుకుని తక్కువ వడ్డీకి అప్పులివ్వడమో చేసుండేవాళ్లు. రియల్టర్లు పెద్దపెద్ద వడ్డీల నుండి బయటపడడానికి తక్కువ రేట్లకే స్థలాలు అమ్ముండేవాళ్లు. కాని నారాయణ వద్ద బ్లాక్‌మనీ అంతా బ్లాక్ అవడంతో బయట మార్కెట్‌లో పెద్దనోట్లకు పెద్దఎత్తున డిమాండ్ ఏర్పడింది. సామాన్య ప్రజలు కొత్త నోట్లకు అగచాట్లు పడుతుంటే రియల్టర్లు మాత్రం తమ అప్పులు తీర్చుకోవడానికి పాతనోట్లు వున్న నల్లకుబేరులకై అన్వేషిస్తున్నారు.

# నెల తిరిగినా.. తరగని 'క్యూ'లు





పెద్దనోట్ల రద్దు జరిగి సరిగ్గా నెలరోజులైంది. అయినా బ్యాంకుల వద్ద, ఏటిఎంల ముందు 'క్యూ'లలో ఎలాంటి మార్పు లేదు. పెద్దనోట్లు రద్దు ప్రకటించిన నవంబర్ నెల 8వ తేదీ మరుసటి రోజున బ్యాంకుల ముందు, ఏటిఎంల ముందు జనం నగదు కోసం ఏ విధంగా బారులు తీరి నిలబడి ఉన్నారో డిసెంబర్ 8వ తేదీన కూడా అలాగే నిలబడి వున్నారు. ఒకరకంగా చెప్పాలంటే అప్పటికంటే కూడా 'క్యూ'లలో నిలబడ్డ జనం ఇప్పుడే ఎక్కువుగా ఉన్నారనిపిస్తోంది. జిల్లాలో నగదు కష్టాలు ఏ మాత్రం తీరడం లేదు. జిల్లాలోని బ్యాంకులకు తగినంత నగదు రాకపోతుండడంతో ఖాతాదారులకు అవసరాలకు తగ్గట్లు నగదు అందించలేక బ్యాంకులు చేతులెత్తేస్తున్నాయి. ఏటిఎంలలో నగదు వుందంటే చాలు... కిలోమీటరు పొడవున క్యూలు ఉంటున్నాయి. తమ దాకా నగదు డ్రా చేసుకునే ఛాన్స్ వస్తే ప్రజలు తిరుమల వెంకన్నస్వామి దర్శనం చేసుకున్నంతగా ఆనందపడుతున్నారు. ముఖ్యంగా ఇది డిసెంబర్ నెల కావడం, తమ అకౌంట్లలో జీతాలు పడి వుండడం, ఈ నెల, వచ్చే నెల పండుగ ఖర్చులు దండిగా ఉండడంతో ఉద్యోగులు ఖాతాలలో వున్న తమ నగదును విత్‌డ్రా చేసుకోవడానికి నానా తంటాలు పడుతున్నారు.

ఇక తమకు వచ్చిన పింఛన్‌లు పొందడానికి వృద్ధులు పడుతున్న బాధలైతే వర్ణనాతీతం. ప్రభుత్వమే చొరవ చూపి వృద్ధులకు, వికలాంగులకు పింఛన్‌లను రెవెన్యూ కార్యాలయాలలో పంపిణీ చేసుంటే వారికి కొంత ఉపశమనంగా ఉండేది. బ్యాంకుల వద్ద వారిని అనవసరంగా నిలబెట్టారు.

జిల్లాలో నగదు కష్టాలు గట్టెక్కాలంటే 3వేల కోట్లు కావాలని లీడ్‌బ్యాంకు వాళ్లు ఆర్‌బిఐకు లెటర్ వ్రాసినా, జిల్లాకు వచ్చింది 168కోట్లే! ఇది ఏ మూలకు కూడా చాల్లేదు. నగదు సరిపడినంత రాకపోతుండడం, అవసరాలు పెరిగిపోతుండడంతో ప్రజలు అసహనానికి లోనవుతున్నారు.

# ఇందిరాభవన్‌లో అంబేద్కర్ వర్ధంతి



ఈ నెల 6వ తేదీన భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 61వ వర్ధంతిని పురస్కరించుకుని నెల్లూరులోని ఇందిరాభవన్‌లో జిల్లా కాంగ్రెస్ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఎస్సీసెల్ రాష్ట్ర కన్వీనర్ శీలం తిరుపయ్య, పీసీసీ సమన్వయకమిటి సభ్యులు సి.వి.శేషారెడ్డి, పీసీసీ ఉపాధ్యక్షులు చేవూరు దేవకుమార్‌రెడ్డి, పీసీసీ ప్రధానకార్యదర్శి పి.చెంచలబాబుయాదవ్, బి.సి సెల్ రాష్ట్ర కన్వీనర్ గాలాజు శివాచారి, డిసిసి ఉపాధ్యక్షులు పత్తి సీతారాంబాబు, మైనార్టీ సెల్ రాష్ట్ర కో–ఆర్డినేటర్ షేక్ ఆసిఫ్ బాషా, సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షులు భవాని నాగేంద్రప్రసాద్, నగర కాంగ్రెస్ అధ్యక్షులు ఉడతా వెంకట్రావ్, పిసిసి అధికార ప్రతినిధి రఘురాం ముదిరాజ్, బెజవాడ గోవిందరెడ్డి, ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షులు జి.కేశవనారాయణ, మైనార్టీ జిల్లా అధ్యక్షులు షేక్ జహంగీర్, మైనార్టీ నగర అధ్యక్షులు షేక్ ఫయాజ్, డిసిసి ప్రధాన కార్యదర్శులు లతారెడ్డి, బాలసుధాకర్, యూత్‌కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు మల్లి బాలకృష్ణ, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు అనురాధారెడ్డి, సేవాదళ్ జిల్లా అధ్యక్షులు దామెర్ల శివప్రసాద్, ఎస్.టి. జిల్లా అధ్యక్షులు నావూరు వెంకటరమణయ్య, షావిల్, పవన్, అనిల్ పాల్గొన్నారు.





# పైచేయి ఎవరిది?

## కమిషనర్ బదిలీలో ఎత్తు-పైఎత్తు

నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వెంకటేశ్వర్లు బదిలీ వ్యవహారం అధికార పార్టీలోనే విభేదాల చిచ్చును రాజేసింది. నెల్లూరు నగరంలో ఏం జరిగినా నాకు తెలియాలి అన్నది మేయర్ అజీజ్ వ్యవహారశైలి. నెల్లూరుకు నేను కింగ్‌ను అనుకుంటున్నాడాయన! కాగా మంత్రి నారాయణ ఈ రాష్ట్రానికి చంద్రబాబు తర్వాత నేనే కింగ్‌ను అనుకుంటున్నాడు. కాబట్టే మేయర్‌తో పని లేకుండానే అతనికి తెలియకుండానే కమిషనర్ వెంకటేశ్వర్లును బదిలీ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ బదిలీ తనకు తెలియకుండానే జరిగిపోవడం అజీజ్‌కు పెద్ద అవమానంగా అనిపించింది. ఇటీవల రోడ్లు ఊడ్చే మిషన్‌ను కూడా తాను లేకుండానే మంత్రి ప్రారంభించినప్పుడు కూడా అజీజ్ అవమానంగా ఫీలయ్యాడు. తన గొప్పను చాటుకోవడానికి అదే మిషన్‌కు రెండోసారి ఓపెనింగ్ నిర్వహించాడు. ఇప్పుడు కమిషనర్ బదిలీ కూడా ఆయనకు మనస్థాపం, మంత్రి మీద కోపం కలిగించింది. వెంటనే చినబాబు లోకేష్‌ను సంప్రదించి కమిషనర్ బదిలీకి తాత్కాలిక బ్రేక్ వేయించారు. ఇది తెలిసి మంత్రికి మండింది. నా ఉత్తర్వులకే అడ్డం చెబుతావా అంటూ మళ్లీ బదిలీ చేయించి తన సత్తా చూపాడు నారాయణ!

## నెల్లూరు కబుర్లు

# నెల్లూరు వద్దంటే వద్దు!



ఇమాముద్దీన్... నెల్లూరీయులకు సుపరిచితమైన పేరు. నిజాయితీకి మారుపేరు. ఒకప్పుడు నెల్లూరు నగరపాలక సంస్థలో సూపరింటెండెంట్ ఇంజనీరు. నెల్లూరు కార్పొరేషన్‌లో అవినీతి అక్రమాలను చూడలేక, అవినీతి పాలకులకు వంత పాడలేక స్వచ్ఛంధ పదవీ విరమణ కోసం ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్న విలువలుగల అధికారి.

నెల్లూరు కార్పొరేషన్ ఎస్ఇగా పనిచేస్తూ ఇమాముద్దీన్ మే 9వ తేదీన స్వచ్ఛంధ పదవీవిరమణకు దరఖాస్తు చేసుకున్నారు. దీనికి కారణం నెల్లూరు కార్పొరేషన్‌లో అవినీతి పోకడలే! మేయర్ అజీజ్ అవినీతి ఆగడాలు ఎక్కువయ్యాయి. ఆయన అనుచరుల దౌర్జన్యాలు పెరిగాయి. తమ అవినీతి ఫైళ్లపై సంతకాలు చేయాలంటూ ఇమాముద్దీన్‌పై మేయర్ వర్గీయుల ఒత్తిడి ఎక్కువైంది. వాళ్ల అవినీతి పాపంలో భాగం పంచుకోలేక ఇమాముద్దీన్ అప్పుడు విఆర్ఎస్‌కు దరఖాస్తు చేసుకున్నారు. నెల్లూరుకు చెందిన పలువురు నాయకులు అధికారులు ఆయనను కలిసి విఆర్ఎస్ తీసుకోవద్దని కోరినా ఆయన వినలేదు. ప్రభుత్వం ఆయన విఆర్ఎస్ దరఖాస్తును ఆమోదించలేదు. తాజాగా ఆయన విఆర్ఎస్‌ను రద్దు చేసుకుని విధుల్లో చేరడానికి సుముఖంగా వున్నట్లు తెలుస్తోంది. కాకపోతే అవినీతి మురికికూపంగా మారిన నెల్లూరు కార్పొరేషన్‌లో మాత్రం పోస్టింగ్ వద్దంటూ ఆయన ప్రాధేయపడుతున్నట్లు సమాచారం.

# జిల్లా రెవెన్యూ అధికారిగా కృష్ణభారతి



జిల్లా రెవెన్యూ అధికారిగా డి.కృష్ణభారతిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తిరుపతి నగరవాసి అయిన కృష్ణభారతి గతంలో కడప డిఆర్ఓగా కూడా పని చేశారు. శ్రీకాకుళం డిఆర్ఓగా పనిచేస్తూ నాలుగు నెలల నుండి సెలవులో వున్నారు. ఇప్పుడామెను నెల్లూరుకు బదిలీ చేశారు. నెల్లూరు డిఆర్ఓగా పనిచేస్తుండిన సుదర్శనరెడ్డి ఈ ఏడాది జూన్ ఆఖరున పదవీ విరమణ చేయగా, అప్పటినుండి తెలుగుగంగ ప్రాజెక్ట్ స్పెషల్ కలెక్టర్ మార్కండేయులు ఇన్‌ఛార్జ్ డిఆర్ఓగా కొనసాగుతూ వచ్చారు.

# ఏసి వాకర్స్ అవినీతి అవగాహన సదస్సు



నెల్లూరు ఏసి సుబ్బారెడ్డి స్టేడియం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం అవినీతి నిరోధక వారోత్సవాల సందర్భంగా అవినీతిపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సదస్సులో నెల్లూరు ఏసిబి డిఎస్పీ తోట ప్రభాకర్ మాట్లాడుతూ డబ్బులు తీసుకుని ఓటు వేయడం, ఆదాయం ఉండి ఆదాయపన్ను కట్టకుండా ఉండటం కూడా అవినీతేనని అన్నారు. మహిళా ఉద్యోగులను ఫైల్స్ తీసుకుని ఇంటికి రమ్మనడం కూడా అవినీతేనన్నారు. నెల్లూరులో ఎన్నో అసోసియేషన్లు ఉన్నాయని, ఒక్క అసోసియేషన్ కూడా అవినీతి గురించి ప్రశ్నించడం లేదని, ప్రజలు కూడా అవినీతికి పాల్పడే అధికారులను ప్రశ్నించినప్పుడే అవినీతిని అరికట్టడం సాధ్యమవుతుందన్నారు. అవినీతిపరుల్ని పట్టుకునే బాధ్యత ఏసిబిది మాత్రమే కాదని, భారతదేశ పౌరులందరి బాధ్యత అన్నారు. ఈ సదస్సులో వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు వేలూరు రంగారావు, కార్యదర్శి స్వర్ణ రమేష్‌బాబు, కోశాధికారి పొన్నం రవిచంద్ర, డా॥ అంకిరెడ్డి, రాఘవేంద్రషెట్టి, నలుబోలు బలరామయ్యనాయుడు, శ్రీనివాసకుమార్, ఓబులరెడ్డి, వీరిశెట్టి హజరత్‌బాబు, తిరుపతి నాయుడు, దొరస్వామినాయుడు, వాకర్స్ సభ్యులు పాల్గొన్నారు.

## మాగుంట శరత్‌చంద్రారెడ్డి యువజన సేవాసమితి ఆధ్వర్యంలో

# అంధులకు పండ్లు, రొట్టెలు



వికలాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 3వ తేదీ మాగుంట శరత్‌చంద్రారెడ్డి యువజన సేవాసమితి ఆధ్వర్యంలో నెల్లూరు దర్గామిట్టలోని విశ్వభారతి అంధుల పాఠశాలలో పిల్లల చేత కేక్ కట్ చేయించి, పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సేవాసమితి సభ్యులు కమతం అశోక్ మాట్లాడుతూ తమ సేవా సమితి అనాధలకు, ఏ ఆదరణకు నోచుకోని పేదలకు సహాయం చేస్తుందన్నారు. సభ్యులు నాగేంద్ర, దారా మహేష్, మనోజ్‌చౌదరి, మహేంద్ర, మణికంఠ, నాని తదితరులు పాల్గొన్నారు.

# పోలీసు కుటుంబానికి సాయం



ఈ ఏడాది ఫిబ్రవరి 27వ తేదీన విధి నిర్వహణలో వుంటూ అనారోగ్యంతో ప్రాణాలు కోల్పోయిన ఏఆర్ ఏఎస్ఐ కె.విజయకుమార్ కుటుంబానికి 6వ తేదీ జిల్లా ఎస్పీ విశాల్‌గున్నీ ప్రభుత్వం నుండి వచ్చిన భద్రతాపరమైన ఆర్థిక సాయాన్ని అందించారు. విజయకుమార్ భార్య విజయరాణి, కుమార్తె నీలిమలకు రెండు లక్షల చొప్పున రెండు చెక్కులను అందజేశారు. ఏఎస్పీ బి.శరత్‌బాబు, ఎం.ప్రసాద్‌రావు, సులోచన పాల్గొన్నారు.

# జాప్ మీడియా సెంటర్ ప్రారంభం



జర్నలిస్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (జాప్) మీడియా సెంటర్‌ను ఈ నెల 3వ తేదీ నెల్లూరు దర్గామిట్ట కరెంటాఫీసు సెంటర్‌లో జాప్ రాష్ట్ర నాయకులు డి.వెంకారెడ్డి, జిల్లా కన్వీనర్ ద్వారం వేణుగోపాల్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ మీడియా సెంటర్ ద్వారా జాప్ సభ్యులతో పాటు జిల్లాలోని జర్నలిస్టుల సంక్షేమం కోసం పాటుపడుతుందన్నారు. జర్నలిస్టులు తమ సమస్యలను మీడియా సెంటర్ దృష్టికి తీసుకుని వచ్చి పరిష్కారం చేసుకోవచ్చన్నారు. జిల్లాలో జాప్ సభ్యత్వాన్ని బలోపేతం చేసి యూనియన్ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. సభ్యులు ఏడుకొండలు, శ్రీనివాసులు, ప్రసాద్, ఎ.శ్రీనివాసులు, వెంకటేష్, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# అపోలోలో 3వ వార్షిక జాతీయ కాన్ఫరెన్స్



అపోలో స్పెషాలిటి హాస్పిటల్ న్యూరాలజీ డిపార్ట్‌మెంట్ వారి మూడవ వార్షిక జాతీయ కాన్ఫరెన్స్ - పెరల్స్ ఇన్ క్లినికల్ న్యూరాలజీని ఈ నెల 3, 4తేదీలలో నెల్లూరు దర్గామిట్టలోని మినర్వా గ్రాండ్‌లో నిర్వహించారు. కాన్ఫరెన్స్ కార్యదర్శి, ప్రముఖ న్యూరాలజిస్ట్ డా॥ బిందుమీనన్ మాట్లాడుతూ కాన్ఫరెన్స్ ముఖ్య లక్ష్యం బోధన, రోగుల పరిశీలన, రోగనిర్ధారణ అన్నారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న అపోలో హాస్పిటల్ గ్రూప్ ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్‌పర్సన్ డా॥ ప్రీతారెడ్డి మాట్లాడుతూ న్యూరాలజీ విభాగం వారు ప్రధాన నగరాలతో సమానంగా రోగులకు చికిత్సనందిస్తున్నారన్నారు. నాలుగున్నర గంటల్లో(గోల్డెన్ పిరియడ్ హవర్స్) వ్యవధిలో జరిగే థ్రోంబోలిసస్ (స్ట్రోక్ చికిత్స) మామూలుగా జరుగుతుందన్నారు. ఈ కాన్ఫరెన్స్‌లో దేశం నలుమూలల నుండి 180 మంది ప్రతినిధులు హాజరయ్యారు. ఫ్యాకల్టీగా జనకపురి హాస్పిటల్ డైరెక్టర్ డా॥మెహందిరత్తా(త్రివేండ్రం), డా॥ మధుసూదనన్ (వైజాగ్), డా॥ వెంకటేశ్వర్లు(మధురై), డా॥ జయకుమార్(హైదరాబాద్), డా॥ సీతా జయలక్ష్మి(చెన్నై), డా॥ మీనాక్షి సుందరం, డా॥ నటరాజన్, డా॥ లక్ష్మీనరసింహన్, డా॥ జాయ్‌వర్గీస్ పాల్గొన్నారు.

# అలరించిన రెయిన్‌బో స్పెక్ట్రమ్



నెల్లూరురూరల్ మండలం కలివెలపాలెంలోని రెయిన్‌బో సిబిఎస్ఇ స్కూల్‌లో స్పెక్ట్రమ్-2016 పేరుతో నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శన ఎంతగానో అలరించింది. ప్రపంచంలోని వింతలు, విశేషాలు, ప్రకృతి సౌందర్యాలు, సైన్స్ కేంద్రాలన్నీ తెచ్చి ఒకే చోట పేర్చినట్లుగా ఈ ప్రదర్శన కనువిందు చేసింది. ముఖ్యంగా ఒక్కో నమూనా గురించి విద్యార్థులు వర్ణించిన తీరు ఎంతగానో ఆకట్టుకుంది. 4, 5 తేదీలలో ఈ ప్రదర్శన నిర్వహించారు. 4వ తేదీ జిల్లా కలెక్టర్ ముత్యాలరాజు, మేయర్ అబ్దుల్ అజీజ్, సిండికేట్ బ్యాంకు డిప్యూటీ జనరల్ మేనేజర్ టి.నరసింహమూర్తి ముఖ్యఅతిథులుగా పాల్గొని స్పెక్ట్రమ్-2016ని ప్రారంభించారు. ప్రదర్శనలో వుంచిన నమూనాలను తిలకించిన అతిథులు విద్యార్థుల ప్రతిభా పాటవాలను అభినందించారు. ప్రదర్శనలో అంతర్జాతీయ విమానాశ్రయం నమూనా, పినాకిల్ మ్యాథ్స్, ఉష్ణవిద్యుత్ దీపం, షాడోప్లే, ఇంజనీరింగ్, పోర్ట్ సిటీ, మైడ్రీమ్ ఇండియా – 2030, అరకులోయ బొర్ర గుహలు, రైల్వేలైన్ కూడిన నమూనాలు ఆకట్టుకున్నాయి. స్కూల్ డైరెక్టర్ పద్మాసుబ్రహ్మణ్యం పర్యవేక్షణలో స్పెక్ట్రమ్-2016 ఎంతో ఫలప్రదంగా జరిగింది. స్కూల్ జాయింట్ డైరెక్టర్ సంధ్యారెడ్డి, ప్రిన్సిపాల్ జయంతి అరుణ, స్వయంప్రభ, ఉపాధ్యాయ సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.





# పార్టీని పటిష్టం చేద్దాం!

## - జిల్లా వైసిపి నేతలకు జగన్ ఉద్బోధ

ఈ నెల 6వ తేదీన హైదరాబాద్ లోటస్‌పాండ్‌లోని వైకాపా కార్యాలయంలో ఆ పార్టీ అధినేత వై.యస్. జగన్మోహన్‌రెడ్డి నెల్లూరుజిల్లా వైసిపి నాయకులతో, పార్టీ పరిస్థితిపై సమీక్షించారు. ప్రధాని నరేంద్రమోడీ 'వన్ కంట్రీ – వన్ ఎలక్షన్' అనే విధానాన్ని తీసుకురావాలని ప్రయత్నిస్తున్నారని, అదే జరిగితే అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలు 2019లో కాకుండా 2018లోనే ఉంటాయని, అప్పటికి పార్టీని అన్ని విధాలా పటిష్టం చేయాలని జగన్ సూచించారు. బూత్‌లెవల్ కమిటీలు వేసుకుని ప్రతి కమిటిలో పదిమంది ఆర్గనైజర్‌లు ఉండేలా చూసుకోవాలని చెప్పారు. నెల్లూరురూరల్, నెల్లూరు నగరం, కోవూరు, సర్వేపల్లి, వెంకటగిరి నియోజకవర్గాల్లో గడపగడపకు వైకాపా యాత్రలు బాగా జరిగియాని అభినందిస్తూ మిగిలిన నియోజకవర్గాల్లోనూ ఈ కార్యక్రమాన్ని వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని, ఆ ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా అభ్యర్థిని నిలబెట్టాలని సూచించారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి, జడ్పీ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి, ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, పి.అనిల్ కుమార్‌యాదవ్, కిలివేటి సంజీవయ్య, రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, మేకపాటి గౌతమ్‌రెడ్డి, మాజీఎమ్మెల్యేలు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, మేకపాటి చంద్రశేఖర్ రెడ్డి, గూడూరు ఇన్‌ఛార్జ్ మేరిగ మురళీధర్‌లు పాల్గొన్నారు.

# పర్యాటకులను ఆకర్షించేలా ఫ్లెమింగో ఫెస్టివల్

## - జిల్లా కలెక్టర్ ముత్యాలరాజు



అధికారులందరూ సమన్వయంతో పనిచేసి ఈ నెల 27, 28, 29తేదీలలో జరుగనున్న ఫ్లెమింగో ఫెస్టివల్‌ను విజయవంతం చేయాలని నెల్లూరుజిల్లా కలెక్టర్ ఆర్.ముత్యాలరాజు పేర్కొన్నారు. ఈ నెల 3న కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో ఫ్లెమింగో ఫెస్టివల్ ఏర్పాట్ల గురించి కలెక్టర్ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనధికారుల కమిటిని కూడా ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా పర్యాటకశాఖాధికారిని ఆదేశించారు. బి.వి.పాలెంలో పర్యాటకులను ఆకర్షించే విధంగా తెరచాప పడవలను ఏర్పాటు చేయాలని సంబంధిత శాఖాధికారిని కోరారు. ముఖ్యంగా పర్యాటకులను ఆకర్షించే విధంగా ఫుడ్‌కోర్టులలో సరసమైన ధరలతో నాణ్యమైన, రుచికరమైన మంచి ఆహారం అందించాలన్నారు. నెల్లూరు రుచులు ఈ ఫుడ్‌కోర్టులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ పండుగ సందర్భంగా క్యాటిల్‌షో, డాగ్‌షో, స్నేక్‌షో వంటి కార్యక్రమాలను ఏర్పాటు చేయాలన్నారు. బోటు షికార్లు నిర్వహించే దగ్గర గజ ఈతగాళ్లు వుండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఫ్లెమింగో ఫెస్టివల్‌కు తగు ప్రచారం కల్పించే విధంగా హోర్డింగ్‌లు, వాల్‌పోస్టర్లు, ఫేస్‌బుక్ మాధ్యమాలను వినియోగించాలని కోరారు. సూళ్లూరుపేట పట్టణం సుందరీకరణ కార్యక్రమాలను వేగవంతంగా అమలు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లా జాయింట్‌కలెక్టర్ ఇంతియాజ్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగుల్లో కూడా అనేకమంది వివిధ ఆటల పోటీలలో పాల్గొనడానికి సిద్ధంగా వున్నారని, వారికి అవకాశం కల్పించాలన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్–2 రాజ్‌కుమార్, జిల్లా పర్యాటక శాఖాధికారి నాగభూషణం, జడ్పీ సిఇఓ బి.రామిరెడ్డి, జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఫ్లెమింగో ఫెస్టివల్‌కు సంబంధించి పాట పాడిన గాయకుడు ఎన్.కృపానందాన్ని కలెక్టర్ అభినందించారు.

# గోవింద నామస్మరణలతో పులకించిన భక్తజనం



శ్రీవారి జన్మనక్షత్రం శ్రవణాన్ని పురస్కరించుకుని తిరుమల తిరుపతి దేవస్థానములు, హిందూ ధర్మప్రచార పరిషత్, హిందూ ధర్మ ప్రచార మండలి సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం నెల్లూరు దర్గామిట్టలోని టిటిడి కళ్యాణ మండపంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారి కళ్యాణోత్సవం భక్తుల గోవింద నామ స్మరణలతో అంగరంగ వైభవంగా జరిగింది. టిటిడి అర్చకులు వేదగిరి ఫణిశర్మ అర్చక బృందం ఆధ్వర్యంలో స్వామివారికి శాస్త్రోక్తంగా తిరుమంజన అభిషేకాలు, విశేషపూజలు నిర్వహించారు. ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు స్వామివారికి కళ్యాణోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. అనంతరం స్వామివారికి పుష్పయాగం నేత్రపర్వంగా జరిగింది. ఉభయకర్తలుగా నలుబోలు బలరామయ్య నాయుడు దంపతులు, నలుబోలు వెంకటరమణారెడ్డి దంపతులు వ్యవహరించారు. అన్నమయ్య ప్రాజెక్ట్ కళాకారుడు గుండాల గురవయ్య ఆలపించిన అన్నమయ్య సంకీర్తనలు, గోవింద నామ సంకీర్తనలు భక్తులను సమ్మోహితులను చేశాయి. టిటిడి హిందూ ధర్మ ప్రచార మండలి అధ్యక్షులు సి.వి.సుబ్రహ్మణ్యం, ఉపాధ్యక్షులు కొండా శేఖర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి వంజివాక ధనుంజయ, వేమిరెడ్డి సనత్‌కుమార్‌రెడ్డి, వీరిశెట్టి సుధాకర్, భానుప్రకాష్, నాగార్జునాచారి, హిందూధర్మ ప్రచార పరిషత్ జిల్లా కో–ఆర్డినేటర్ డాక్టర్ మల్లెల శ్రీహరి తదితరులు పర్యవేక్షించారు. కళ్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులకు శ్రీవారి దివ్యప్రసాదం లడ్డూలను పంపిణీ చేసి, అన్నసంతర్పణం గావించారు.

# కండలేరుకు నీళ్లివ్వండి

## - బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి



సోమశిల ప్రాజెక్ట్‌లోకి ఇన్‌ఫ్లోలో అదనంగా వచ్చి చేరుతున్న 12టిఎంసీల నీటిని కండలేరుకు వదలాలని జిల్లా పరిషత్ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి జిల్లా కలెక్టర్‌కు సమర్పించిన ఒక వినతిపత్రంలో కోరారు. నవంబర్ 8న జరిగిన ఐఎబి సమావేశంలో సోమశిల ప్రాజెక్ట్ పరిధిలో 3.10లక్షల ఎకరాలకు సాగునీరు మరియు తాగునీరు అందించేందుకు 40టీఎంసీలు కేటాయించారు. కండలేరు పరిధిలో తాగునీరు మరియు పశుగ్రాసం కోసం 25శాతం నీటితో చెరువులను నింపాలని నిర్ణయించారు. కండలేరులో ఈరోజుకి 15.4టిఎంసీల నీళ్లున్నాయి. డెడ్ స్టోరేజీ పోను 7 టీఎంసీల నీళ్లే లభ్యతలో ఉంటాయి. సోమశిలకు వచ్చే 12టీఎంసీల నీటిని కండలేరుకు తరలిస్తే మొత్తం 19టీఎంసీలతో ఈ రిజర్వాయర్ క్రింద వున్న 1.50లక్షల ఆయకట్టుకి సాగునీరు అందించే అవకాశముంటుంది. చిత్తూరుజిల్లాకు ఎలాంటి నీటి కేటాయింపులు లేకున్నా కండలేరు రిజర్వాయర్ నుండి 6టీఎంసీలు తరలించినందు వల్ల ఆయకట్టు రైతులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. కాబట్టి ఐఎబి సమావేశం వెంటనే నిర్వహించి కండలేరు క్రింద వున్న 1.50లక్షల ఎకరాల ఆయకట్టుకు ఒక పంటకు తెలుగుగంగ కాలువ ద్వారా 15టీఎంసీల నీటిని విడుదల చేయుటకు ప్రభుత్వ అనుమతిని కోరాలని ఆయన ఆ వినతిపత్రంలో పేర్కొన్నారు.

# ఘంటసాల జయంతి వేడుకలు

## సింహపురి కీర్తిని చాటిన వేమిరెడ్డికి ఘన సన్మానం



సాంస్కృతిక, ఆధ్యాత్మిక, సామాజిక సేవలతో సింహపురి కీర్తిని చాటిన ఘనత ప్రముఖ పారిశ్రామికవేత్త వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికే దక్కుతుందని వక్తలు కొనియాడారు. ఆదివారం నెల్లూరు టౌన్‌హాలులో ఘంటసాల 94వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా నెల్లూరులో ఘంటసాల విగ్రహాన్ని ఏర్పాటు చేసిన వేమిరెడ్డికి ఘనసన్మానం జరిగింది. ముఖ్యఅతిథులుగా పాల్గొన్న నెల్లూరురూరల్, నగర ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, అనిల్‌కుమార్‌యాదవ్, నగర మేయర్ అబ్దుల్ అజీజ్, సినీ నిర్మాత సి.కళ్యాణ్, డిప్యూటిమేయర్ ముక్కాల ద్వారకానాథ్‌లు మాట్లాడుతూ తెలుగు ప్రజల హృదయాల్లో ఘంటసాల గానం అజరామరంగా నిలిచి ఉంటుందన్నారు. అలాగే సేవా కార్యక్రమాల ద్వారా నెల్లూరు ప్రజలకు చేరువైన ఘనత వేమిరెడ్డికే దక్కుతుందన్నారు. ఘంటసాల విగ్రహాన్ని నెల్లూరులో ఏర్పాటు చేసిన వేమిరెడ్డిని కళాకారులు, సంగీతాభిమానులు కలకాలం గుర్తుంచుకుంటారన్నారు. అనంతరం ముఖ్యఅతిథులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సంగీత విభావరి, శాస్త్రీయ నృత్యప్రదర్శనలు, సాయి హేమంత్ కృష్ణ నాశికా వేణుగానం అందరినీ విశేషంగా ఆకట్టుకున్నాయి.

నీలకంఠం శ్రీనివాసులురెడ్డి పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో సింహపురి ఆసుపత్రి ఎం.డి కాటంరెడ్డి రవీంద్రరెడ్డి, పాటూరు శ్రీనివాసులు, కోసూరు రత్నం, శరత్, అమీర్‌జాన్, కళాకారులు, సంగీతాభిమానులు పాల్గొన్నారు.



# కల్యాణ వైభవం...!



చెన్నై వాస్తవ్యులు పోరూరి శ్రీనివాసరావు - మైథిలల కుమార్తె జ్వాలా శ్రావణి - వెంకట వంశవర్ధన్ (రాజమహేంద్రవరం వాస్తవ్యులు అక్కిరాజు గోవర్ధన్ శర్మ - రాజకామేశ్వరిల కుమారుడు)ల కళ్యాణం ఈ నెల 4వ తేదీ నెల్లూరులోని సిపిఆర్ కళ్యాణ మండపం నందు జరిగింది. వధూవరులకు 'లాయర్' శుభాశీస్సులు.

### అగ్రిగోల్డ్ బాధితుల సమస్యలను

## అసెంబ్లీలో చర్చిస్తాం..

**- నెల్లూరు ఎమ్మెల్యేలు**

అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేసేంతవరకు పోరాడుతామని, ఈ సమస్యలపై అసెంబ్లీలో చర్చిస్తామని నెల్లూరు రూరల్, నగర ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, అనిల్‌కుమార్‌యాదవ్‌లు పేర్కొన్నారు. ఆదివారం నెల్లూరు పప్పులవీధి లోని సుమంగళి కళ్యాణ మండపంలో అగ్రిగోల్డ్ కస్టమర్స్, ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు ముప్పాళ్ళ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు మాట్లాడుతూ అగ్రిగోల్డ్ బాధితుల పక్షాన ఆమరణ నిరాహారదీక్ష చేసేందుకు




వెనుకాడబోమన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యదర్శి సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ ముక్కాల ద్వారకానాథ్, మాజీఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, అగ్రిగోల్డ్ బాధితులు పాల్గొన్నారు.

## పకడ్బందీగా పోలీస్ సెలక్షన్స్

**- జిల్లా ఎస్పీ విశాల్‌గున్నీ**

కానిస్టేబుల్స్, జైలు వార్డన్స్ ఎంపికలో భాగంగా 5850 మంది అభ్యర్థులకు ఈ నెల 9 నుంచి 14వ తేదీ వరకు నెల్లూరు పోలీస్ పరేడ్‌గ్రౌండ్‌లో దేహదారుఢ్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ విశాల్‌గున్నీ తెలిపారు. సోమవారం నెల్లూరు దర్గామిట్ట లోని ఉమేష్‌చంద్ర మెమోరియల్ కాన్ఫరెన్స్‌హాల్లో విలేకర్లతో ఆయన మాట్లాడుతూ ప్రిలిమినరీ రాత పరీక్షల్లో జిల్లాలో 5,453 మంది పురుషులు, 397మంది మహిళలు ఉత్తీర్ణులై దేహదారుఢ్య పరీక్షలకు అర్హత సాధించారన్నారు. అభ్యర్థులందరూ నెట్ నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని తెలిపారు. ఈ నెల 9వ



తేదీన 800మంది, 10న వెయ్యిమంది, 11న 1200మంది, 12న 800మంది పురుషులు, 397మంది స్త్రీలు, 13న 1200మంది, 14వ తేదీన 453మంది పురుషులతో పాటు అప్పీలు అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు నిర్వహిస్తామన్నారు. అభ్యర్థులు నిర్దేశించిన రోజుల్లో ఉదయం 5గంటలకు పోలీస్‌పరేడ్‌గ్రౌండ్‌కు చేరుకోవాలన్నారు. అభ్యర్థులు తమ వెంట ఎస్ఎస్‌సి మార్కుల లిస్టు, విద్యార్హత సర్టిఫికెట్, రిజర్వేషన్ కేటగిరి అభ్యర్థులు కుల నిర్ధారణ, నేటివిటీ, మాజీ సైనికులు సర్టిఫికేట్లు ఒరిజినల్స్ వెంట తీసుకురావాలన్నారు. అనంతరం పిఎంటి, పిఇటి విభాగాల్లో పరీక్షలు జరుగుతాయన్నారు. అర్హత సాధించిన అభ్యర్థులకు రెండు మూడు గంటల అనంతరం 100మీటర్ల పరుగు, లాంగ్‌జంప్ పోటీలు జరుగుతాయన్నారు. అన్ని పరీక్షల్లో అర్హత సాధించిన అభ్యర్థులకు 2017 జనవరి 22వ తేదీన విశాఖపట్నం, కాకినాడ, విజయవాడ, గుంటూరు, తిరుపతి, కర్నూలులో ఉదయం 10గంటల నుండి మధ్యాహ్నం 1గంట వరకు రాత పరీక్ష జరుగుతుందన్నారు.

## ఎయిడ్స్‌ను తరిమేద్దాం...

సమాజంలో ఎయిడ్స్‌ను సమూలంగా నిర్మూలించాలంటే ప్రతిఒక్కరూ చర్చించుకుంటే సాధ్యపడుతుందని డాక్టర్ సి.రోహిణి తెలిపారు. గూడూరు పట్టణంలో ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా పలు ప్రాంతాల్లో ర్యాలీలు, అవగాహన సదస్సులు ఇటీవల నిర్వహించారు. గూడూరు పట్టణంలోని జడ్పీ బాలుర పాఠశాల ఎన్‌సిసి విద్యార్థులు మైదానంలో చేసిన ప్రదర్శన ఆకట్టుకుంది. విద్యార్థులు ఎయిడ్స్‌ను తరిమేద్దాం అంటూ పురవీధుల్లో ర్యాలీ చేపట్టారు. ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షురాలు వై.స్నేహలతారెడ్డి మాట్లాడుతూ ఎయిడ్స్‌ను సమిష్టిగా చర్చించి నిర్మూలనకు శ్రీకారం చుడదామని పిలుపునిచ్చారు. అనంతరం ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షురాలు వై.స్నేహలతారెడ్డి, ఆంధ్ర మహిళా మండలి గౌరవాధ్యక్షురాలు డాక్టర్ సి.రోహిణి ఆధ్వర్యంలో దుప్పట్లు, ఆహార పొట్లాలను పంపిణీ చేశారు. పట్టణంలోని డిఆర్‌డబ్ల్యు కళాశాల విద్యార్థినులు ప్లకార్డులు చేతపట్టి పురవీధుల్లో ర్యాలీ చేపట్టి స్థానిక గడియారపు స్థంభం కూడలి వద్ద మానవహారం నిర్వహించారు.



# గూడూరు డివిజన్ వార్తలు

### విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో

## భగవద్గీత కంఠస్త పోటీలు

గూడూరు పట్టణం అళఘ నాథస్వామి దేవస్థానంలో డివిజన్ స్థాయి భగవద్గీత కంఠస్త శ్లోకాల పోటీలను ఆదివారం నిర్వహించారు. పలు ప్రాంతాలకు చెందిన విద్యార్థులు, యువకులు, వయోజనులకు వేర్వేరుగా పోటీలను నిర్వహించి జిల్లా స్థాయికి ఎంపిక చేశారు. అధిక



సంఖ్యలో విద్యార్థులు పోటీలకు హాజరయ్యారు. 1వ తరగతి నుంచి 3వ తరగతి విద్యార్థుల మధ్య జరిగిన భగవద్గీత కంఠస్త శ్లోకాల పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను బి.హరితేజ, ప్రణతి, చక్రధర్ కైవసం చేసుకున్నారు. 4వ తరగతి నుంచి 7వ తరగతి వరకు జరిగిన పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను సౌమ్యశ్రీ, సౌమ్య, దుర్గాప్రసాద్ కైవసం చేసుకున్నారు. 8వ తరగతి నుంచి 10వ తరగతి వరకు జరిగిన పోటీలలో గ్రీష్మ వేదవ్యాస్, కృష్ణ తేజశ్విని స్థానం పొందారు. కళాశాల స్థాయిలో జరిగిన పోటీల్లో టివిఎల్ కళ్యాణి, శ్రావణి, వయోజనులు మహిళల మధ్య జరిగిన పోటీల్లో అనితశ్రీ, గౌతమి, నీరజ వరుస స్థానాలను కైవసం చేసుకున్నారు. జిల్లా స్థాయికి ఎంపికైన విజేతలను అభినందించారు. ఈ సందర్భంగా విశ్వహిందూ పరిషత్ ప్రతినిధి మురళీనాయుడు మాట్లాడుతూ హిందువులకు సంస్కృతి సంప్రదాయాలు ముఖ్యమన్నారు. భగవద్గీత పోటీల వల్ల స్వచ్ఛమైన తెలుగుపదాలను నేర్చుకుంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులు ఎమ్.మురళీరెడ్డి, ఆర్.వెంకటేశ్వరరావు, ప్రసాద్‌రెడ్డి, న్యాయనిర్ణేతలు గంగిశెట్టి శివకుమార్, చెంచుకృష్ణయ్య, వసంతకుమార్‌రాజ్, రామసుబ్బయ్య, రామిరెడ్డి, రాజేశ్వరమ్మ పాల్గొన్నారు.

### పోలీసుల ఆధ్వర్యంలో

## నగదు రహిత లావాదేవీల అవగాహన సదస్సు

గూడూరు పట్టణంలో పట్టణ సిఐ సుబ్బారావు, పోలీసులు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నగదు రహిత లావాదేవీల అవగాహన ర్యాలీని డిఎస్పీ బాదిపల్లి శ్రీనివాస్‌తో కలిసి ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ ప్రారంభిం




నగదు రహిత ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, డిఎస్పీ శ్రీనివాస్, ఛైర్‌పర్సన్ దేవసేన తదితరులు

చారు. పట్టణంలోని గడియారపు స్థంభం కూడలి వద్ద నుంచి విద్యార్థులు, వివిధ రంగాలకు చెందిన వ్యాపారులు, కౌన్సిలర్లు, ర్యాలీగా బయలుదేరి ఆసుపత్రిరోడ్డు, కోనేటిమిట్ట వరకు నగదు లావాదేవీలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పెద్దనోట్ల రద్దుతో తాత్కాలికంగా కొంత సమస్యలున్నా భవిష్యత్‌లో అందరికీ మంచి జరుగుతుందన్నారు. ప్రజల్లో చైతన్యం తీసుకు వచ్చేందుకు పోలీసులు చొరవ తీసుకోవడం అభినందనీయమన్నారు. ప్రతిఒక్కరూ ఇక నుండి నగదు రహిత లావాదేవీలపై దృష్టి సారించాలని గూడూరు డిఎస్పీ బాదిపల్లి శ్రీనివాస్ కోరారు. ఈ కార్యక్రమంలో ఛైర్‌పర్సన్ పొనకా దేవసేన, పులిమి శ్రీనివాసులు, బిల్లు చెంచురామయ్య, సోమిశెట్టి చెంచురామయ్య, వాటంబేటి శివకుమార్, ఎస్ఐలు సుధాకర్, నరేష్, నాయకులు మల్లిఖార్జునరెడ్డి, శ్రీనివాసులు, సురేష్, ఎంపిడివో భవాని, వివిధ కళాశాలల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

### వైజేపి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో

## వృద్ధులకు మంచాలు, దుప్పట్లు

గూడూరు పట్టణం మాయా బజారులోని తిరుమల మహిళ వృద్ధాశ్రమానికి వైజేపి లయన్స్ క్లబ్ గూడూరు ఆధ్వర్యంలో ఇటీవల మంచాలను, దుప్పట్లను, వాల్‌క్లాక్‌లను పంపిణీ చేశారు. ఆర్.వెంకటేశ్వరరావు దాతృత్వంలో వికలాంగులకు, వృద్ధులకు వస్తువులను అందించారు. ఈ కార్యక్రమంలో




వైజేపి లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు వరిదిరెడ్డి చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ వైజేపి లయన్స్ ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు, ఎక్కడ అవసరాలు వున్నాయో అక్కడ గుర్తించి సేవా కార్యక్రమాలను చేస్తున్నట్లు తెలిపారు. పల్లెల్లో అవసరమైన దగ్గర మెడికల్ క్యాంప్‌లు పెడుతున్నట్లు తెలిపారు. ఆ క్లబ్ ప్రతినిధులు నాగహరికృష్ణ, ఎస్.ఎల్.ఎన్.స్వామి, గురునాథం, వెంకటరామిరెడ్డి, ఆర్.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీను గల్పిక

# కార్డులతోనే కాపురాలు చేయొచ్చు

అది 'ఏబిసిడి' ఛానెల్ స్టూడియో... హైటెక్‌రత్న, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో ఆ ఛానెల్ అధినేత గోకుల్‌కృష్ణ 'జికెతో తెరచుకున్న గుండె' కార్యక్రమంలో భాగంగా ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నారు. పెద్దనోట్ల రద్దుపై మీ స్పందన ఏంటని జి.కె. అడిగాడు. నాకు చాలా అసహనంగా వుంది. సునామీలను కుడి చేత్తో, తుఫాన్‌లను ఎడమచేత్తో ఆపినవాడిని, భూకంపాలను కాలి క్రింద తొక్కి పెట్టినోడిని... నాకే ఇది అసహనంగా వుందంటే ఇక ప్రజలకు ఎంత అసహనంగా ఉంటుందో, పెద్దనోట్ల రద్దు అసహనంపై ఇక ఉద్యమం చేయాలనుకుంటున్నాను అని చెప్పాడు. అప్పుడు జి.కె ప్రేక్షకులకు ఒక ప్రశ్న వదిలాడు. పెద్దనోట్ల రద్దు వ్యవహారం తనకే అసహనం కలిగిస్తుందన్న చంద్రబాబు వ్యాఖ్యలను మీరు సమర్థిస్తారా? అవును అయితే 'ఎస్' అని, కాదు అయితే 'నో' అని టైప్ చేసి ఎస్‌ఎమ్‌ఎస్ ద్వారా మాకు పంపండి అని చెప్పాడు. ఒక్క నిముషం తర్వాత స్క్రీన్ మీద 99శాతం మంది 'ఎస్' అని 1 శాతం మంది 'నో' అని ఎస్‌ఎంఎస్‌లు పంపినట్లు కూడా రిజల్ట్స్ ఇచ్చారు.

ఇదంతా కూడా ఢిల్లీలోని తన కార్యాలయంలో కూర్చుని ప్రధాని నరేంద్ర మోడీ చూస్తున్నాడు. ఆయన పక్కనే కేంద్రమంత్రులు మనోహర్ పారికర్, రాజ్‌నాథ్‌సింగ్, అరుణ్‌జైట్లీ, వెంకయ్య నాయుడులు కూడా వున్నారు. మోడీ వుండి... ఏం వెంకయ్యాజీ, మన చంద్రబాబుకేంటో అసహనంగా ఉందంటా... ఆ కేసీఆర్‌కు ఫోన్ చేసి 'ఓటు-నోటు' కేసు ఎక్కడదాకా వచ్చిందో చూడమను అని చెప్పాడు. అప్పుడు వెంకయ్య కలుగజేసుకుని... అతనిని ఖాళీగా పెడితే ఇలాగే ఏదో ఒకటి మాట్లాడుతుంటాడు సార్, ఈ పెద్దనోట్ల రద్దు వ్యవహారంలో అతనిని కూడా ఇన్‌వాల్వ్ చేద్దాం. అప్పుడు మనతో పాటూ లాక్కోలేక పీక్కోలేక అగచాట్లు పడుతుంటాడని అన్నాడు. ఏం చేద్దామంటారని మోడీ అడిగాడు. బాబుకు టెక్నాలజీ అంటే మహా పిచ్చి. బిల్‌గేట్స్‌కు కూడా కంప్యూటర్ల మీద ఈయనకున్నంత మోజుండదు. కాబట్టి 'క్యాష్ లెస్ ట్రాన్సాక్షన్ కమిటీ' అని ఒక దానిని వేసి ఆయనను కన్వీనర్‌గా పెడదాం, ఇక మనల్ని నోరెత్తి ఒక్క మాట అనలేడని వెంకయ్య సలహా ఇచ్చాడు. అలాగే చెయ్యండని మోడీ చెప్పాడు.

★★★★★

హైదరాబాద్‌లోని ఏబిసిడి ఛానెల్ స్టూడియోలో జి.కె ఇంటర్వ్యూ కొనసాగుతోంది. అప్పుడే చంద్రబాబు సెల్‌ఫోన్ మోగింది. బాబు ఫోన్ ఎత్తాడు. అవతల నుండి వెంకయ్య... నిన్ను క్యాష్‌లెస్ ట్రాన్సాక్షన్స్ కమిటి కన్వీనర్‌గా ప్రధాని నియమించారు. ఈ పదవికి నువ్వే అర్హుడివి. నువ్వే న్యాయం చేయగలవు... అని చెప్పి పెట్టేసాడు. బాబు ఈ విషయాన్ని ఎదురుగా వున్న జి.కెకు చెప్పాడు. వెంటనే ఛానెల్‌లో బ్రేకింగ్ న్యూస్ అంటూ 'క్యాష్‌లెస్ ట్రాన్సాక్షన్స్ కమిటి కన్వీనర్‌గా చంద్రబాబు' అంటూ పది నిముషాల పాటూ పదేపదే చూపించారు. ఓ పక్క అది చూపిస్తూ ఇంకో బాక్స్‌లో ఇంటర్వ్యూ కొనసాగిస్తూ... ఇప్పుడు చెప్పండి ఈ పదవి రావడం పట్ల మీరెలా ఫీలవుతున్నారని జి.కె. అడిగాడు. దానికి బాబు... నా ఆలోచనలకు తగ్గ బాధ్యత ఇది. కరెన్సీ రూపంలో లావాదేవీలు ఉండకూడదని, క్రెడిట్, డెబిట్ కార్డులు, చెక్కులు, పేటిఎం వంటి సాంకేతిక మార్గాల ద్వారా చెల్లింపులు జరగాలని నేను మొదట్నుండి కోరుకుంటున్నాను. ప్రజల్లో ఆ మార్పు తెచ్చే ప్రక్రియను కేంద్రం నాకే అప్పగించిందంటే, నా తెలివితేటల పట్ల వారికెంత నమ్మకముందో అర్థమవుతుంది. పెద్దనోట్ల రద్దు అనేది దేశంలో అవినీతి, నల్లధనం నిర్మూలన కోసమే! ప్రజలు 'క్యూ'లలో నిలబడి అసహనం చెందాల్సిందేమీ లేదు. నోట్ల మార్పిడి కోసం ప్రజలు 'క్యూ'లో నిలబడడాన్ని అసహనంగా కూడా భావించడం లేదు అని చెప్పాడు. అప్పుడు వెంటనే జి.కె. "పెద్దనోట్ల రద్దుపై ప్రజలు అసహనం చెందడం లేదన్న చంద్రబాబు వ్యాఖ్యల్ని మీరు సమర్థిస్తారా?" మీ సమాధానం అవును అంటే 'ఎస్' అని, కాదు అయితే 'నో' అని టైప్ చేసి యథాఫళంగా ఎస్‌ఎంఎస్‌లు పంపండి అని ప్రశ్న వదిలాడు. ఒక్క నిముషంలోనే మళ్ళీ 'ఎస్'కు 99శాతం మంది 'నో'కు ఒక్క శాతం మంది ఓటేసినట్లు ఫలితాలిచ్చారు. చంద్రబాబు ఆ రిజల్ట్స్ చూసి... మీకు ఎస్‌ఎంఎస్‌లు ఇంత తొందరగా వస్తాయా? అయినా ఎంతమంది ఈ కొద్ది టైంలో ఎస్‌ఎంఎస్‌లు పంపిస్తారని ధర్మ సందేహం వెలిబుచ్చాడు. ప్రజలు పంపించే ఎస్‌ఎంఎస్‌లు చూస్తే నాతోపాటూ మీకు కూడా మూడ్ మారుద్ది. అయినా మన ఛానల్‌లో వాళ్లెవరో పంపించే రిజల్ట్స్ తీసుకోవడమేంటి... ఆ రిజల్ట్స్ కూడా మేమే నిర్ణయిస్తామని చెప్పాడు. సరే నేను నా విధుల్లోకి దిగాలి... ఒకట్రెండు నెలల్లో ప్రజలంతా కరెన్సీని మరచిపోయి కార్డుల వైపు మళ్లేలా చూడాలి. నేను మళ్లీ కలుస్తానంటూ చంద్రబాబు లేచాడు.

★★★★★

అది సింగపూర్ కమ్ అమరావతి రాజధాని పరిధిలోని వెలగపూడి గ్రామం. నగదు రహిత కమిటి కన్వీనర్ చంద్రబాబు, కమిటీ సభ్యులు శివరాజ్‌సింగ్ చౌహాన్, దేవేంద్ర ఫడ్నవీస్, నారాయణస్వామిలు ఆ గ్రామంలో ఓ ఇంటికి వెళ్లి తలుపు తట్టారు. ఒక మహిళ తలుపు తీసింది. నీ పేరేంటమ్మా అని చంద్రబాబు అడిగాడు. వెంకాయమ్మ అని ఆమె చెప్పింది. చూడు వెంకాయమ్మా... నీ దగ్గర కార్డు ఉందా అని చంద్రబాబు అడిగాడు. ఉన్నాయయ్యా అని వెంకాయమ్మ చెప్పింది. వెరీగుడ్ వెంకాయమ్మ... నీలాంటి మహిళలే ఈ దేశానికి స్ఫూర్తి కావాలి... ఈ కార్డు వల్ల చాలా ఉపయోగాలున్నాయి వెంకాయమ్మా... మీ ఇంట్లో డబ్బులు పెట్టుకోవాల్సిన పనే లేదు. ప్రొవిజన్ షాపుకు పోయి కార్డు ఇస్తే సరుకులు ఇస్తారు, రేషన్ షాపుకు వెళ్లి కార్డు ఇచ్చినా నిత్యావసర వస్తువులిస్తారు. కరెంట్ బిల్లులు, ఫోన్ బిల్లులను కూడా కార్డు ద్వారానే కట్టొచ్చు. చందన బ్రదర్స్, కళానికేతన్, శుభమస్తు వంటి షాపింగ్‌మాల్స్‌కు వెళ్లి ఎంచక్కా ఈ కార్డులతో కావాల్సినవి కొనుక్కోవచ్చు. హోటల్‌కెళ్లి కడుపు నిండా తిన్నా బిల్లుకు డబ్బులివ్వబల్లేదు అని చంద్రబాబు చెబుతుండగా లోపల నుండి వెంకాయమ్మ భర్త రాయల్‌స్టాగ్ రాజన్ వచ్చాడు. గురుడు మంచి నిషాలో వున్నాడు. షంద్రబాబు సర్... బార్‌లో పీకల దాకా తాగి డబ్బులివ్వబల్లేదా... కార్డు షరిపోతుందా... అని అడిగాడు. అందుకు చంద్రబాబు... అసలు మీరు వేటికీ డబ్బులివ్వాల్సిన పని లేదు. అన్నింటికీ కార్డే వాడొచ్చు అని చెప్పాడు. అంతే వెంకాయమ్మ చంద్రబాబు రెండు చేతులు పట్టుకుని... మా బాబే, మా బంగారు నాయనే... ఎన్నికలప్పుడు బాబు వస్తే బ్రతుకులు మారుతాయంటే ఏంటో అనుకున్నా... నిజంగానే మా బ్రతుకులు మార్చేసావు. మాకు డబ్బులు సంపాదించుకునే పని లేకుండా చేసావు, నీ ఋణం ఎలా తీర్చుకోవాలి నాయనా... జన్మజన్మలకు నువ్వే మా సీఎం కావాలని ఏడుస్తూ చెప్పసాగింది. చంద్రబాబుకు డౌటొచ్చి ఇంతకీ మీ దగ్గర ఏం కార్డుంది అని అడిగాడు. వెంటనే వెంకాయమ్మ లోపలకెళ్ళి అర నిముషంలో తిరిగొచ్చింది. ఇదిగో నాయనా... ఇది రేషన్‌కార్డు, ఇది ఆధార్‌కార్డు, ఇది ఆరోగ్యశ్రీ కార్డు... ఇదేమో కిసాన్ కార్డ్... ఇదిగో ఇదేమో ఓటర్ కార్డు అంటూ కార్డులన్నీ చంద్రబాబు చేతిలో పెట్టింది. కార్డ్ అంటే జనం ఈ కార్డులనుకుంటున్నారా... క్రెడిట్, డెబిట్ కార్డులు కాదా అని మనసులో అనుకుంటూ చంద్రబాబు అవాక్కయ్యాడు.

---

## మేషం



అశ్వని, భరణి, కృత్తిక 1 పాదము

ప్రభుత్వ పరంగా అనుమతులు శ్రమతో లభిస్తాయి. ఉద్యోగులు అధికారులతోను, పబ్లిక్‌తోను జాగ్రత్తగా మెలగాలి. స్థిరాస్తుల లావాదేవీలు, కోర్టు వ్యవహారాలు వాయిదా పడగలవు. అనవసర తగాదాలు వ్యవహారాల జోలికి పోకండి. శుభవార్తలు వింటారు. ఉన్నత విద్యావకాశాలు లభించగలవు. వృత్తి వ్యాపారాలు ఆశించిన రీతిలో నుండవు. గాయాలు తగలవచ్చును.

## వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

కోర్టు వ్యవహారాలు వాయిదా పడగలవు. కుటుంబంలో భిన్నాభిప్రాయాలుంటాయి. ఉద్యోగులకు బాధ్యతలు పెరిగినా సమర్థవంతంగా నిర్వహిస్తారు. ఉద్యోగ ప్రయత్నాల్లో అనుకూలత బాగుంటుంది. వాహనాలు నడిపేటప్పుడు జాగ్రత్త అవసరం. దైవ, సేవా కార్యాలకై శ్రమ పడతారు. ఆరోగ్య విషయంలో జాగ్రత్త అవసరం. ఇంట బయట వ్యవహార బాధ్యతలు పెరుగుతాయి.

## మిథునం



మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

అనుకోని ఆదాయం, అనుకోని ప్రయాణాలుంటాయి. బంధుమిత్రుల ఆకస్మిక రాక ఉంటుంది. ప్రభుత్వ అనుమతులు, నిర్మాణాలలో పనులు తొందరగా జరుగుతాయి. ఉద్యోగులకు గుర్తింపు గౌరవాలు బాగుంటాయి. ఉన్నత విద్యావకాశాలు లభిస్తాయి. నూతన పెట్టుబడులు పొదుపు పథకాలకు ప్రయత్నాలు అనుకూలిస్తాయి. సమస్యలను సర్దుబాటు చేసికొనండి.

## కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

దూర ప్రయాణాలుంటాయి. ఉద్యోగులకు ప్రోత్సాహకరంగా ఉండి అధికారులకు సన్నిహితం కాగలరు. ఉద్యోగార్థుల ప్రయత్నాలు అనుకూలిస్తాయి. ఆరోగ్యం బాగుంటుంది. శుభవార్తలు వింటారు. కుటుంబ సౌఖ్యం, పోటీ పరీక్షల్లో విద్యార్థులు సత్తా చూపడం జరుగుతుంది. కోర్టు వ్యవహారాలలో సొంతంగా పర్యవేక్షించడం మంచిది. పనులు సక్రమంగా జరుగుతాయి.

## సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

చెప్పుడు మాటలు వినకుండా సొంత నిర్ణయాలు తీసుకొంటారు. ప్రభుత్వ అనుమతులు, బ్యాంకు ఋణాలు లభిస్తాయి. కొత్త విద్యా కోర్సులకు అవకాశాలు దొరుకుతాయి. కుటుంబసౌఖ్యం బాగుంటుంది. చేపట్టిన పనులు సమర్థవంతంగా నిర్వహిస్తారు. కాని ఎక్కువగా టెన్షన్ పడుతుంటారు. ఆదాయము ఖర్చులు సరిపోతుంటాయి. స్థిరాస్తుల లావాదేవీలు జరుపుతారు.

## కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

దైవ, సేవా కార్యక్రమాలకు సహాయం చేస్తారు. వ్యాపారులు, ఉద్యోగులపై అధికారుల వత్తిడి ఎక్కువగా ఉంటుంది. ఇంటి నిర్మాణాలు నిదానంగా జరుగుతాయి. విద్యార్థులు ఉన్నత విద్యకు మరింత శ్రమ పడవలసి ఉంటుంది. మీ ఆరోగ్యం విషయంలో శ్రద్ధ అవసరం. ఇంట్లో సభ్యులతో అనుకూలత తక్కువ. పిల్లల విద్యా, వివాహాది విషయాలపై ఆందోళన ఉంటుంది.



బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు
బాలాజీనగర్, నెల్లూరు

## రాశి - మీ వాసి

తేది. 9.12.2016 నుండి
తేది. 15.12.2016 వరకు

ఈ వారం మీన మేష వృషభ మిథున రాశులలో చంద్రుడు, సింహంలో రాహువు, కన్యలో గురువు, వృశ్చికంలో రవిశనులు, ధనుస్సులో బుధుడు, మకరంలో కుజ శుక్రులు, కుంభంలో కేతువు సంచరిస్తారు.

### పంచాంగము

తేది 16 శుక్రవారం నుండి ధనుర్మాస ప్రారంభం

### ముహూర్తములు

తేది 9 శుక్రవారం ఉదయం 7.10 నుండి గంట 9.20లోగా ధనుర్లగ్నమున గృహారంభ వ్యాపార వివాహ ఉపనయనములు. రాత్రి 12.48 నుండి గంట 2.52లోగా కన్యాలగ్నమున వివాహ గృహప్రవేశములు.

### మార్గశీర్ష మాస శుక్లపక్ష తిథులు

| | | | |
|---|---|---|---|
| తేది. 9 | శుక్ర | దశమి | సా॥ గం.5.36వ॥ |
| తేది. 10 | శని | ఏకాదశి | సా॥ గం.3.31వ॥ |
| తేది. 11 | ఆది | ద్వాదశి | ప॥ గం.1.17వ॥ |
| తేది. 12 | సోమ | త్రయోదశి | ప॥ గం.10.56వ॥ |
| తేది. 13 | మంగళ | చతుర్దశి | ఉ॥ గం.8.35వ॥ |
| | పిదప | పూర్ణిమ | పూర్తిగ |
| తేది. 14 | బుధ | పాడ్యమి | రా॥ గం.4.7వ॥ |
| తేది. 15 | గురు | విదియ | రా॥ గం.2.12వ॥ |

## తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

రావలసిన బాకీలు కొంత మేరకు వసూలు కాగలవు. కొత్త గృహోపకరణాలు, విలువైన వస్తువులు కొంటారు. శుభకార్య ప్రయత్నాలు పట్టుదలతో చేస్తారు. ఉద్యోగార్థులకు అవకాశాలు బాగుంటాయి. ఆర్థిక వ్యవహారాలలో జాగ్రత్త పడండి. ఆరోగ్యం బాగుంటుంది. వ్యాపారవృద్ధికి కొత్త పథకాలు, ఆలోచనలతో ముందుకు సాగుతారు. అనుకున్న పనులు పట్టుదలతో జరుపుతారు.

## వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

బంధుమిత్రులతో సమస్యలు రాకుండా చూచుకొనాలి. ప్రభుత్వ అనుమతులు ఆలస్యం కావచ్చును. కళా క్రీడా రంగాలలో అవకాశ ప్రోత్సాహాలు బాగుంటాయి. ఆరోగ్యం బాగుంటుంది. కుటుంబ సౌఖ్యం బాగుంటుంది. కఠినంగా మాట్లాడడం, వ్యవహరించడం వల్ల తగాదాలు రావచ్చును. వృత్తి వ్యాపారాలు సామాన్యంగా జరుగుతాయి. రాబడి సంతృప్తిగా ఉంటుంది.

## ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

నూతన పెట్టుబడులకు, వ్యాపార విస్తరణకు అనుకూలము. దైవ కార్యాలలో పాల్గొనడం, అనుకోని ప్రయాణాలుంటాయి. ఉద్యోగులకు మంచి సమర్థత గుర్తింపు గౌరవాలు బాగుంటాయి. కొత్త కాంట్రాక్టులు లీజులు లభించగలవు. ఉన్నత విద్యావకాశాలు లభించగలవు. వృత్తి వ్యాపారాలలో కొంత అభివృద్ధి ఉండి ఆదాయం పెరుగుతుంది. రావలసిన బాకీలు అందుతాయి.

## మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

స్థిరాస్తుల లావాదేవీలు జరపడం, పెండ్లి ప్రయత్నాలందు అనుకూలత ఉంటుంది. సాంకేతిక శాస్త్ర కళా క్రీడా రంగాల వారికి మంచి అవకాశాలుంటాయి. సోదరవర్గంలో అనారోగ్య బాధలుంటాయి. ఉద్యోగులకు విధి నిర్వహణ సామర్థ్యం బాగుంటుంది. ప్రభుత్వం నుండి అనుమతులు, ప్రైవేటు రంగముల వారికి అవకాశాలు, కుటుంబసౌఖ్యం బాగుంటుంది.

## కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

ఉద్యోగులకు అదనపు బాధ్యతలు, అధికారులకు స్థాన మార్పులుంటాయి. పెట్టుబడులకు అవకాశాలు, షేర్లయందు లాభాలుంటాయి. ముఖ్య కాగితాలు, విలువైన వస్తువులను జాగ్రత్త పరచుకొనండి. ఉద్యోగార్థులకు అవకాశాలుండగలవు. ప్రముఖులు, పెద్దలతో పరిచయాలు కలుగుతాయి. ఆరోగ్యం బాగుంటుంది. శుభ కార్యాల నిర్ణయాలకు అనుకూల పరిస్థితులుంటాయి.

## మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

ఉద్యోగులకు కార్యసామర్థ్యముంటుంది. దైవ, సేవా కార్యక్రమాలకు సహాయపడటం జరుగుతుంది. క్రొత్త వస్తువులు సమకూర్చుకొనడం, కొత్త కాంట్రాక్టులు, లీజులు పొందడం, నిర్మాణాలను త్వరగా జరపడం జరుగుతుంది. ఆరోగ్యం బాగుంటుంది. ఆర్థిక ఇబ్బందుల నుండి బయటపడతారు. వృత్తి వ్యాపారాలలో ఆదాయము కొద్దిగా పెరుగుతుంది. షేర్ల మీద స్వల్పలాభాలుంటాయి.

### శాంతిభద్రతల పరిరక్షణలో...

# హోంగార్డుల సేవలు ప్రశంసనీయం

### - ఎస్పీ విశాల్‌గున్నీ



శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులతో సమానంగా హోంగార్డులు చేస్తున్న సేవలు ప్రశంసనీయమని, ట్రాఫిక్ నియంత్రణ, బందోబస్తు తదితర విధుల్లో హోంగార్డులు తమదైన ముద్ర వేసుకున్నారని, అంకిత భావంతో విధులు నిర్వహించి జిల్లా హోం గార్డు యూనిట్‌కు మంచిపేరు తీసుకు రావాలని నెల్లూరుజిల్లా ఎస్పీ విశాల్‌గున్నీ పేర్కొన్నారు. నెల్లూరు పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో మంగళవారం 54వ హోం గార్డుల వ్యవస్థాపక దినోత్సవం ఘనంగా జరిగింది. తొలుత హోంగార్డులు కవాతు నిర్వహించారు. వారి వద్ద నుంచి ఎస్పీ గౌరవ వందనం స్వీకరించారు. ఏఎస్పీ బి.శరత్‌బాబు మాట్లాడుతూ స్వచ్ఛంధ సంస్థగా ఏర్పడిన హోంగార్డు వ్యవస్థ పోలీసుశాఖలో అంతర్భాగమై పోలీసు సిబ్బందితో ధీటుగా విధులు నిర్వర్తిస్తూ వారికి తామేమీ తీసిపోమని నిరూపిస్తు న్నారన్నారు. ఇటీవల జరిగిన కృష్ణ పుష్క రాలు, తిరుమల బ్రహ్మోత్సవాలు, రొట్టెల పండుగ బందోబస్తు విధుల్లో హోంగార్డుల సేవలు ప్రశంసనీయమన్నారు. హోంగార్డు డిఎస్పీ కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ జిల్లాలో 796మంది హోంగార్డులు వివిధ విభాగాల్లో పనిచేస్తున్నారన్నారు. హోం గార్డుల సంక్షేమానికి అన్ని చర్యలు తీసు కుంటున్నామన్నారు. అనంతరం ఎస్పీ నుంచి అతిథులకు, విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనపరచిన హోంగార్డులకు జ్ఞాపికలు అందజేశారు.

## పోలీసు కుటుంబాలకు ఆర్థిక సాయం



ఇటీవల మృతిచెందిన పోలీసు కుటుంబాలకు ప్రభుత్వం నుంచి రావాల్సిన రాయితీలకు సమయం పడుతున్నందున హ్యూమానిటీ కార్పస్ ఫండ్ నుంచి బాధిత కుటుంబసభ్యులకు బుధవారం ఆర్థికసాయం అందించారు. నెల్లూరు నాల్గవనగర ఏఎస్సైగా పనిచేసిన మొలకల నిరంజన్‌రెడ్డి, విఆర్‌లో వున్న కానిస్టేబుల్ నిరంజన్‌ల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.50వేలు చొప్పున ఏఎస్పీ శరత్‌బాబు తన కార్యాలయంలో అందజేశారు. వారికి ప్రభుత్వం నుంచి రావాల్సిన రాయితీలు త్వరగా అందించేందుకు కృషి చేస్తానన్నారు. పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు ప్రసాదరావు, ఏఆర్ఎస్సై శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## విశ్వసాయి విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు





రాష్ట్రీయ శాంస్క్రిట్ సంస్థాన్ న్యూఢిల్లీ 2015-16 విద్యాసంవత్సరానికి ఇంట ర్మీడియట్ సంస్కృతంలో ప్రతిభ కనబర చిన విశ్వసాయి జూనియర్ కళాశాల విద్యార్థులు ఎం.చిత్రనిఖిత, ఎం.రేవంత్ చక్రవర్తిలకు స్కాలర్‌షిప్‌లు ప్రకటించింది. నెల్లూరు మాగుంట లేఅవుట్‌లోని విశ్వ సాయి కళాశాలలో మంగళవారం స్కాలర్‌షిప్‌లకు ఎంపికైన విద్యార్థులను అభినందించారు. విశ్వసాయి విద్యా సంస్థల ఛైర్మెన్ ఎన్.సత్యనారాయణ, వైస్ ఛైర్మెన్ కృష్ణమోహన్‌లు మాట్లాడుతూ ఇద్దరు విద్యార్థులు ప్రస్తుతం గుంటూరు వైద్యకళాశాలలో ప్రథమ సంవత్సరం చదువుతున్నారని తెలిపారు.

## అంబేద్కర్ బాటలో నడవాలి

భారతరత్న డా॥ బి.ఆర్.అంబేద్కర్ ఆశయాలను నేటి యువత, విద్యార్థులు ఆదర్శంగా తీసుకొని ఆయన ఆశయాల బాటలో నడవాలని డా॥ బిఆర్ అంబేద్కర్ మిషన్ ఛైర్మెన్ కె.తిరువక్కూరు అన్నారు. మంగళవారం నెల్లూరు దర్గామిట్టలోని అంబేద్కర్ భవన్‌లో అంబేద్కర్ మిషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అనంతరం అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అరవ పూర్ణప్రకాష్, తొగురు వెంకయ్య, నూకలపాటి దాసు, వి.రామరాజు పాల్గొన్నారు.

## ఎస్పీడిసిఎల్‌లో నగదు రహిత లావాదేవీలు

నగదు రహిత లావాదేవీలను పూర్తి స్థాయిలో నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆర్.ముత్యాలరాజు విద్యుత్‌శాఖ అధికా రులను ఆదేశించారు. నగదు రహిత లావాదేవీలపై ప్రజల్లో అవగాహన కల్పిం చేందుకు మంగళవారం నెల్లూరు విద్యుత్ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లా డుతూ ఎస్పీడిసిఎల్ పరిధిలో నెల్లూరుజిల్లా ముందుంటుందని, నగదు రహిత లావా దేవీల్లో కూడా అదే స్థానాన్ని కొనసాగించా లన్నారు. ట్రాన్స్‌కో ఎస్ఇ కళాధరరావు మాట్లాడుతూ విద్యుత్ బిల్లులు నగదుతో కాకుండా డెబిట్, క్రెడిట్ కార్డులతో చెల్లిం చాలని సూచించారు. జిల్లాలో విద్యుత్, రెవెన్యూ కేంద్రాల్లో స్వైపింగ్ మిషన్లను అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలి పారు. అనంతరం విద్యుత్ ఉద్యోగులకు జీతాలకు సంబం ధించి కలెక్టర్ చేతుల మీదుగా ఒక్కొక్కరికి రూ.10వేలు అంద జేశారు. తొలుత నగదు రహిత లావా దేవీలపై ప్రజల్లో అవగాహన కల్పించే దుకు విద్యుత్‌శాఖ ఉద్యోగులు విద్యుత్ భవన్ నుంచి టౌన్‌హాలు వరకు ర్యాలీ నిర్వహించారు. సమావేశంలో సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



గత 2దశాబ్దాలుగా రత్నమ్మ ఛారిటబుల్ సొసైటీ(మేనకూరు) బడుగు బలహీన వర్గాల వారికి చేసిన సేవలకు గుర్తింపుగా విశ్వజన కళామండలి(హైదరాబాద్) వారు ఈ నెల 4న హైదరాబాద్, సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆ సొసైటీ తరపున సొసైటీ ప్రతినిధి, నెల్లూరు జిల్లాకు చెందిన ప్రముఖ కవి, సమాజ సేవకుడు రాచపాళెం రఘుకు 'జాతీయ అంబేద్కర్ అవార్డు'ను బహుకరించారు. తెలంగాణ మంత్రి ఈటెల రాజేందర్ ఆయనకు ఈ అవార్డును ప్రదానం చేశారు.



# కావలి కబుర్లు

### ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేందుకే

## గడపగడపకు వైసిపి



ప్రభుత్వం అవలంభిస్తున్న అరాచక, అవినీతి విధానాలు, వైఫ ల్యాలను ప్రజలకు అర్థమైయ్యేలా వివ రించి ఎండగట్ట డానికే గడపగడ పకు వైయస్‌ఆర్‌సిపి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి అన్నారు. బుధవారం ఎమ్మెల్యే సూచనల మేరకు వైయస్‌ఆర్‌సిపి పట్టణ కమిటి ప్రధాన కార్యదర్శి ఏరువ రమేష్ నాయుడు ఆధ్వర్యంలో 31వవార్డు వైకుంఠపురం లో గడపగడపకు వైయస్‌ఆర్‌సిపి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వార్డులోని సమస్యలను, ప్రజల ఇబ్బందులను గుర్తించి అధికారుల దృష్టికి తీసుకువెళ్ళి పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. అందుకు అవసరమైన సహాయ సహకారాలను అందించేందు తాను అందుబాటులో ఉంటానన్నారు. పార్టీని మరింత బలోపేతం చేసేందుకు వార్డు ఇన్‌ఛార్జ్‌గా తలపనేని ప్రభాకర్‌నాయుడిని నియమించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీలను తుంగలోతొక్కి ప్రజలను మోసగించి పరిపాలన సాగిస్తున్నారన్నారు. ప్రజల పక్షాన నిలచి, పార్టీని బలోపేతం చేసేందుకు ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో వైయస్‌ఆర్‌సిపి నాయకులు చెంచులనాయుడు, కొండప నాయుడు, రమణయ్యనాయుడు, పద్మనాభరెడ్డి, రవి, సురేష్‌రెడ్డి, దశరదరామయ్య, మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ ఆశయాల సాధనకు ఉద్యమించాలి



సమాజంలో అంట రానితనం, కులవివక్షత, ఆర్థిక, రాజకీయ అస మానతలైన అంబేద్కర్ ఆశయాలను సాధించు కునేందుకు ప్రతి దళిత, గిరిజనుడు ఉద్యమిం చాలని అంబేద్కర్ రైట్స్ అసోషియేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆత్మకూరి బ్రహ్మయ్య అన్నారు. మంగళవారం డా॥బిఆర్ అంబేద్కర్ 60వ వర్ధంతి సందర్భంగా దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షులు యస్ మల్లి ఆధ్వర్యంలో జేబి కాలేజి నుండి బ్రిడ్జి సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం వరకు విద్యార్థులతో బారీ ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... అంబేద్కర్ మరణించి 60 సంవత్సరాలు కావస్తున్నా ఇప్పటికీ పాలకులు దళిత, గిరిజనుల అణచివేత మూలంగా బడుగువర్గాలు రోడ్ల పాలైన పరిస్థితి ఉందన్నారు. ఇకపై అందరూ కలసి ఉద్యమాన్ని ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్‌విడియస్ వెంకటేశ్వర్లు, విద్యార్థి నాయకులు గోవర్ధన్, వేణు, సుమంతు, మదన్, వార్డన్ ఉమాశంకర్, విజయరత్నం, శాంసన్, మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

## సమాజసేవకు పాటుపడేవారే వాలంటీర్లు



తమ వ్యక్తిగత జీవితాన్ని, సమయాన్ని సమాజ సేవకు అంకితమిచ్చి పాటుపడేవారే నిజమైన వాలంటీర్లని కావలి రెడ్‌క్రాస్ కార్యదర్శి డి. రవిప్రకాష్ అన్నారు. సోమవారం స్థానిక రెడ్‌క్రాస్ భవనంలో రవిప్రకాష్ అధ్యక్షతన ఇంటర్నేషనల్ వాలంటీర్స్ డే ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నాటి గుజరాత్ భూకంపం నుండి నిన్నటి క్రిష్ణా పుష్కరాల వరకు ప్రజలకు విశేష సేవలందించిన కావలి రెడ్‌క్రాస్ వాలంటీర్లు రెడ్‌క్రాస్ ఉద్యమానికి వన్నెతెచ్చారని, వారిని అభినందించారు. వాలంటీర్లు బి.లక్ష్మీనంద, కె.ప్రీతమ్ శెట్టి, యం.సాయిగుప్తా, డి.నచికేత్, డి.పుష్యమిత్రులకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఇన్స్‌పెక్టర్ జనరల్ గుంటూరు రేంజ్ వారు పంపిన అభినందన పత్రాలను బహూకరించారు. అనంతరం ముఖ్యఅతిథిగా పాల్గొన్న జిల్లా కార్యక్రమ నిర్వహణాధికారి డి.సుందరరాజును సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు గంధం ప్రసన్నాంజనేయులు, ఉపాధ్యక్షులు తన్నీరు మాల్యాద్రి, సెంట్రల్ బ్యాంకు డైరెక్టర్ సుధీర్ నాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

# తరలి వెడలె తలైవి

(మొదటి పేజీ తరువాయి)



ఒక సంచలనానికి తెరపడింది. ఒక శకం ముగిసింది. సవాళ్లకే సవాళ్లు విసిరి, కష్టాల చేతే కన్నీళ్లు పెట్టించి, సమస్యలకే సమస్యలు సృష్టించి, పురుషాధిక్య ప్రపంచంలో కొమ్ములు తిరిగిన మొనగాళ్ల నడుములు వంచిన వీరనారి, విప్లవనాయకి, తమిళనాడు ముఖ్యమంత్రి జయలలిత ఈ నెల 5వ తేదీ రాత్రి 11.30గంటలకు ఈ లోకానికి శాశ్వతంగా వీడ్కోలు పలికి తిరిగిరాని లోకాలకు తరలివెళ్లారు. కోట్లాది మంది అభిమానులను శోకసముద్రంలో ముంచిన ఆమె, తన 68వ ఏట జీవన ప్రయాణాన్ని ముగించారు. వ్యక్తిగత జీవితంలోనూ, రాజకీయ జీవితంలోనూ ఎన్నో పోరాటాలలో విజయం సాధించిన ఆమె మృత్యువుతో 75రోజులు సుధీర్ఘ పోరాటం సాగించినా చివరికి దాని ముందు తలవంచక తప్పలేదు. ఈ ప్రపంచంలోనే ఒక అద్భుత మహిళాశక్తికి పునర్జన్మనివ్వాలని చెన్నైలోని అపోలో వైద్యులు చేసిన విశ్వప్రయత్నాలన్నీ కూడా నిష్ఫలమయ్యాయి.

తీవ్రమైన జ్వరం, డీహైడ్రేషన్‌తో ఆమె సెప్టెంబర్ 22న చెన్నై, గ్రీమ్స్‌రోడ్డులోని అపోలో ఆసుపత్రిలో చేరారు. తొలుత ఆమె ఆరోగ్యంపై గందరగోళ పరిస్థితి ఏర్పడింది. అప్పుడే ఆమె ఆరోగ్యం విషమించిందనే వార్తలు రావడంతో అభిమానులు ఆందోళన చెందారు. అపోలో వైద్యులతో పాటు, ఎయిమ్స్ వైద్యులు, లండన్‌కు చెందిన డాక్టర్ రిచర్డ్‌బేలే ఆధ్వర్యంలో ఆమెకు అత్యాధునిక వైద్యం అందించారు. ఈ క్రమంలో ఆమె కోలుకున్నారని, పత్రికలు చదవడం, ఆహారం తీసుకోవడం చేస్తున్నారని, త్వరలోనే డిశ్చార్జ్ చేస్తామని ఆసుపత్రి వర్గాలు పేర్కొనడంతో అభిమానులు ఊరటచెందారు. అమ్మ ఆరోగ్యం బాగయ్యిందని ఆనందపడి గుళ్లలో మొక్కులు కూడా తీర్చుకున్నారు. జయలలిత ఆస్పత్రిలో బెడ్ మీద కూర్చున్న ఫోటోలు కూడా సోషల్ మీడియాలో రావడం అభిమానులకు నమ్మకాన్ని కలిగించింది. అయితే అంతా సాఫీగా సాగిపోతుంది, జయలలిత త్వరలోనే డిశ్చార్జ్ అవుతుందనుకున్న తరుణంలో విధి అడ్డం తిరిగింది. ఈ నెల 4వ తేదీ ఆమె తీవ్రమైన గుండెపోటుకు గురికావడంతో వైద్యులు ఆమెను క్రిటికల్ కేర్ యూనిట్‌కు తరలించి ఎక్మో ద్వారా అధునాతన చికిత్స అందించారు. అయినా ఆమె ఆరోగ్యం ఏ మాత్రం మెరుగు కాలేదు. ఢిల్లీ నుండి ఎయిమ్స్ వైద్యులు కూడా వచ్చి పరీక్షించారు. జయలలితను ఇక దేవుడే బ్రతికించాలి అనేది అప్పుడే తెలిసిపోయింది. కాని అమ్మ గుండె ఆగింది... అమ్మ ఇక లేదు... అమ్మ మనల్ని వదిలి శాశ్వతంగా వెళ్లిపోయింది... అని ఆసుపత్రి గేట్ల ముందు వున్న పిచ్చి అభిమానులకు చెప్పేదెవరు? అలా చెప్పాలంటే ఎంత ధైర్యం కావాలి? ఒకవేళ అలా చెబితే తమిళనాడు పరిస్థితి ఏంటి?

## వ్యూహాత్మకంగా వ్యవహరించిన కేంద్రం

జయలలిత మరణాన్ని అధికారికంగా ప్రకటించే విషయంలో కేంద్ర ప్రభుత్వం వ్యూహాత్మకంగా వ్యవహరించింది. తమిళనాడు ప్రభుత్వాన్ని మొత్తం తమ అదుపులోకి తీసుకుంది. 4వ తేదీ సాయంత్రం జయలలిత గుండెపోటుకు గురైంది. 5వ తేదీ మధ్యాహ్నానికల్లా ఆమెను బ్రతికించడం కష్టమని తేలిపోయింది. తమ అమ్మ చనిపోయిందని తెలిస్తే అభిమానులు అప్పటికప్పుడు పెనువిధ్వంసాలకు పాల్పడే అవకాశముంది. పరిస్థితులను గమనించిన కేంద్రం ముందుగా 9కంపెనీల పారామిలటరీని, భారీఎత్తున పోలీసు బలగాలను రంగంలోకి దించింది. జయలలిత పరిస్థితి విషమంగా ఉందనే వార్తలు మాత్రమే రాత్రి వరకు ప్రజల్లోకి పంపారు. ఈ విధంగా అభిమానులను మానసికంగా సిద్ధం చేశారు. అపోలో ఆసుపత్రి వద్ద వున్న అభిమానులను పంపించేసారు. తమిళనాడులోని అన్ని నగరాలు, పట్టణాలు, గ్రామాల్లో అన్ని వ్యాపార సముదాయాలు మూసివేసే టైం దాకా వేచిచూసారు. బస్సులు కూడా డిపోలకు చేరేదాకా చూసారు. తమిళనాడు ఇక నిద్రకు ఉపక్రమించిన సమయంలో అంటే 5వతేదీ రాత్రి 11.30 గంటలకు జయలలిత చనిపోయిన విషయాన్ని ప్రధాని నరేంద్రమోడీ అనుమతి తీసుకుని ప్రకటించారు. అప్పుడు ఈ వార్త తెలిసినా జనాలు వీధుల్లోకి వచ్చి ఆందోళనలు చేసే పరిస్థితి లేదు. ఆ రాత్రంతా కూడా తమిళ ప్రజలు ఇళ్లల్లోనే బాధను అనుభవించారు. తెల్లవారగానే 'అమ్మ'ను చూడడానికి పొయెస్ గార్డెన్, రాజాజీ హాల్‌లకు తరలివచ్చారు. ఈ నేపథ్యంలో తమిళనాడులో ఎలాంటి విధ్వంసాలు జరుగకుండా కేంద్రం ముందుగానే ఎంతో వ్యూహాత్మకంగా వ్యవహరించిందని చెప్పొచ్చు.

## పోటెత్తిన అభిమానం

జయలలిత చనిపోయిందనగానే తమిళనాడులో చాలామంది అభిమానుల గుండెలు ఆగిపోయాయి. కోట్లాదిగుండెలు రోదించాయి. అమ్మ చివరి దర్శనం కోసం ప్రజలు రాజాజీ హాల్‌కు పోటెత్తినట్లు వచ్చారు. భారత రాష్ట్రపతి, ప్రధానిలతో పాటు వివిధ రాష్ట్రాల గవర్నర్‌లు, ముఖ్యమంత్రులు, కేంద్ర, రాష్ట్ర మంత్రులు, సినీ ప్రముఖులు... ఇలా అన్ని రంగాల వారు తరలివచ్చి 'అమ్మ'కు నివాళులర్పించారు. సాయంత్రం జయలలిత భౌతిక కాయంతో రాజాజీ హాల్ నుండి మెరీనా బీచ్ వరకు అంతిమయాత్ర లక్షలాది జన సమూహం మధ్య సాగింది. స్వర్గీయ ఎం.జి.రామచంద్రన్ ఘాట్ పక్కనే ఆమె అంత్యక్రియలు నిర్వహించారు. చెక్కపెట్టెలో ఆమె మృతదేహాన్ని వుంచి సైనికలాంఛనాలతో ఖననం చేస్తుంటే... ఒక చరిత్ర కాలగర్భంలో కలిసిపోతున్నట్లే అనిపించింది.



## ఆరోగ్యంపై నిర్లక్ష్యమే కారణం!

ఎలాంటి రాజకీయ నేపథ్యం లేకుండా వ్యక్తిగత జీవితంలోనూ, రాజకీయ జీవితంలోనూ ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొని తమిళనాడు రాజకీయాలతో పాటు పలు సందర్భాల్లో దేశ రాజకీయాలను సైతం శాసించిన జయలలిత తన ఆరోగ్యం విషయంలో మాత్రం తగిన జాగ్రత్తలు తీసుకోలేకపోయింది. ఆమె కోరుకుంటే ప్రపంచ దేశాలలో మేటి వైద్యులు ఆమె వద్దకే వచ్చి చికిత్స చేస్తారు. లేదా ప్రపంచంలో ఏ అగ్రదేశానికైనా ఆమె వెళ్లి వైద్యం చేయించుకోవచ్చు. కాని ఆరోగ్యం పట్ల ఆమె అశ్రద్ధ చేసింది. ఆమెకు ముఖ్యమనుకున్న వాళ్లు కూడా ఆమె ఆరోగ్యాన్ని పట్టించుకోలేదు. ఊబకాయం, మధుమేహం, అధిక రక్తపోటు ఆమె శరీరాన్ని శక్తిహీనం చేస్తూ వచ్చాయి. ముఖ్యంగా ఆహారం విషయంలో ఆమెకు నియంత్రణ ఉండేది కాదని తెలుస్తోంది. ఫలితంగా ఆమెకు కిడ్నీ, కాలేయంకు సంబంధించిన సమస్యలు తలెత్తాయి. ఈ ఏడాది ఎన్నికలకు ముందే ఆమె విదేశాలకు వెళ్లి చికిత్స చేయించుకోవాలనుకున్నారు. అయితే ఎన్నికల సమయంలో ప్రతిపక్షం తనపై దుష్ప్రచారం చేస్తుందనే ఉద్దేశ్యంతో ఆగిపోయారు. ఈ ఏడాది ఎన్నికల సభలలో కూడా ఆమె తక్కువుగానే పాల్గొన్నారు. అయినా కూడా అంచనాలకు అందని విజయం సాధించారు. తమిళనాడులో వరుసగా రెండోసారి అధికారాన్ని నిలబెట్టుకున్న ఖ్యాతి ఆమెది. అయితే ఆ ఆనందాన్ని ఆరునెలలు కూడా అనుభవించకుండానే భువి నుండి దివికేగారు.


## గత ఏడాది జల సముద్రం... ఈ యేడాది జన సముద్రం

కాలమో, విధి వైపరీత్యమో గాని సరిగ్గా 2015 డిసెంబర్ నెలలోనే చెన్నై నగరం జలసాగరంగా మారింది. కుండపోతగా కురిసిన వర్షాలతో నగరం మొత్తం వరదలో చిక్కుకుంది. దాదాపు తేరుకోవడానికి నెలరోజులు పట్టింది. సరిగ్గా ఏడాది తర్వాత ఇదే నెలలో చెన్నై నగరం 'అమ్మ' మరణంతో జన సముద్రంగా మారింది. జనం కన్నీటితో నగరంలో మరోసారి వరదలు పోటెత్తినట్లైంది. 2015లో వరదల నుండి నెలలోనే తేరుకున్న చెన్నై ప్రజలు మరి అమ్మ లేదనే జ్ఞాపకం నుండి కోలుకోవడానికి ఎంత కాలం పడుతుందో?

ఏదేమైనా, దేశ రాజకీయాలలో జయలలిత అనబడే ఈ కోమలవల్లి ఒక చరిత్ర... పోరాటానికి నిలువెత్తు రూపం... స్త్రీ తనను తాను మలచుకుంటే వ్యక్తి కాదు శక్తి అని నిరూపించిన ధీరవనిత. 'అమ్మ'గా బిడ్డలకు పాలివ్వకపోయినా... అమ్మలా ప్రజలను పాలించి, వారి గుండెల్లో దీపమై వెలుగుతున్న జీవనజ్యోతి జయలలిత!

# అవినీతి అంతమైతేనే అభివృద్ధి

**- ఏసిబి డిఎస్పీ తోట ప్రభాకర్**



సమాజంలో అవినీతి అంతమైతేనే అభివృద్ధి సాధ్యమవుతుందని నెల్లూరు ఏసిబి డిఎస్పీ తోట ప్రభాకర్ అన్నారు. సోమవారం ముత్తుకూరు మండలం గోపాలపురంలోని కేఎస్ఎస్‌పిఎల్ సెక్యూరిటీ కేంద్రంలో అన్ని విభాగాల సెక్యూరిటీగార్డుల అవగాహన సమావేశం జరిగింది.

ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ దేశ జనాభా 120కోట్లు ఉంటే సక్రమంగా ఆదాయం పన్నులు కట్టేది కేవలం 3కోట్ల మందేనన్నారు. తమ పర్యవేక్షణలో లక్ష మంది ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నారని, తమ సిబ్బంది మాత్రం పదిమందేనన్నారు. అన్ని ప్రభుత్వ శాఖల్లో అవినీతి ఉందన్నారు. అవినీతి, అక్రమాలు మీ దృష్టికి వస్తే వెంటనే తమకు తెలియజేయాలన్నారు. పెద్దనోట్ల రద్దు వల్ల భయపడాల్సిన అవసరం లేదని, అవినీతిపరులే భయపడాలన్నారు. ఈ సమావేశంలో కేఎస్ఎస్‌పిఎల్ ప్రిన్సిపల్ రాజేంద్రప్రసాద్, మనోహర్‌బాబు, సెక్యూరిటి అధికారులు పాల్గొన్నారు.

# 15 వరకు 500కు ఛాన్స్

ఈ నెల 15వ తేదీ వరకు టోల్‌గేట్‌ల వద్ద పాత 500 రూపాయల నోట్లు చెల్లుబాటుకు కేంద్రం అనుమతినిచ్చింది. మొదట డిసెంబర్ 2వ తేదీ వరకే అనుమతినిచ్చారు. అయితే కొత్త 500నోట్లు అందుబాటులోకి రాకపోవడం, టోల్‌గేట్ల నిర్వాహకుల వద్ద 2వేల నోట్లకు సరిపడా చిల్లర లేకపోవడం మూలంగా టోల్‌గేట్ల వద్ద భారీ ఎత్తున ట్రాఫిక్‌జామ్ కాసాగింది. టోల్ నిర్వాహకులకు, వాహనాల డ్రైవర్లకు మధ్య గొడవలు రాసాగాయి. దేశ వ్యాప్తంగా కూడా ఈ పరిస్థితులను గమనించిన కేంద్రం ఈ నెల 15వరకు టోల్‌గేట్ల వద్ద పాత 500నోటు చెల్లుబాటు అవుతుందని ప్రకటించింది. దీంతో జిల్లాలో కావలి, వెంకటాచలం, బూదనం, సూళ్లూరుపేట టోల్‌గేట్ల వద్ద ట్రాఫిక్ తిప్పలు తప్పాయి.

# మంత్రి పరువు మటాష్!

(మొదటి పేజీ తరువాయి)

నెత్తినంతా చెడకొరికిందనే సామెతను ఇక్కడ నారాయణ అమలులోకి తెచ్చాడు. పట్టభద్రుల నియోజకవర్గం అభ్యర్థిగా గౌరవప్రదమైన వ్యక్తులను, మేధావులను, వివిధ రంగాల్లో నిష్ణాతులైన వారిని, స్వచ్ఛంధ సేవకులను పెట్టాలి. నారాయణ ఇవేమీ పట్టించుకోకుండా, మూడుజిల్లాల తెలుగుదేశం ముఖ్యనేతలతో కూడా సంప్రదించకుండా, ఏకపక్షంగా తన అనుచరుడు వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డిని పట్టభద్రుల నియోజకవర్గం అభ్యర్థిగా నిర్ణయించాడు. ఈ విషయంలోనే మూడు జిల్లాల తెలుగుదేశం నాయకులు మంత్రిపై ఆగ్రహంతో వున్నారు.

ఇక ఉపాధ్యాయ నియోజకవర్గం అభ్యర్థిత్వాన్ని చిత్తూరు జిల్లాకు చెందిన పలువురు ఆశిస్తుండగా మంత్రి మాత్రం మాజీమంత్రి పరసా రత్నంను అభ్యర్థిగా ప్రకటించే ప్రయత్నంలో ఉన్నాడు. అయితే ఈ లోపే టీడీపీ మిత్రపక్షమైన బీజేపీ వాళ్లు కూడా ఉపాధ్యాయస్థానం నుండి తమ పార్టీ అనుబంధ ఉపాధ్యాయ సంఘాలైన 'అపస్' ద్వారా అభ్యర్థిని రంగంలోకి దించాలని నిర్ణయించింది. బీజేపీ అభ్యర్థిని పెడితే తెలుగుదేశం అభ్యర్థికి పడాల్సిన ఓట్లు చీలడం ఖాయం. ఉపాధ్యాయ నియోజకవర్గంలో బీజేపీకి గణనీయంగానే ఓట్లున్నాయి. బీజేపీ అభ్యర్థిని లేకుండా చేయాలని మంత్రి నారాయణ ప్రయత్నిస్తుండగా, బీజేపీ వాళ్లు మాత్రం పట్టభద్రుల స్థానం మీరు తీసుకుని ఉపాధ్యాయుల స్థానాన్ని తమకు వదలమంటున్నారు. కాని మంత్రి మాత్రం ఈ రెండు స్థానాల్లో తెలుగుదేశం అభ్యర్థులను నిలబెట్టి, తన నేతృత్వంలో గెలిపించి తన సత్తా ఏంటో చంద్రబాబుకు చూపాలనుకుంటున్నాడు. మరి మంత్రివర్యుల ప్రయత్నాలు ఎంతవరకు ఫలిస్తాయో చూడాలి.

# వెంకయ్య కీలకపాత్ర

(మొదటి పేజీ తరువాయి)

తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. వెంకయ్య సూచనల ప్రకారమే కేంద్రం అన్ని చర్యలు చేపట్టింది. ఇక జయలలిత వారసుడిగా పన్నీరు సెల్వంను ఎంపిక చేయడంలోనూ వెంకయ్య తన పాత్ర పోషించారు.

ఒక దశలో కేంద్ర పెద్దలకు తెలియకుండానే జయ సన్నిహితురాలు శశికళ వ్యూహాత్మకంగా సిఎం పీఠాన్ని తన అనుచరుడు పళనిస్వామికి అప్పగించడానికి ప్రయత్నించింది. ఆసుపత్రిలో ఓ పక్క జయలలిత మృతదేహం ఉండగానే మరోపక్క శశికళ ఆ పార్టీ ఎమ్మెల్యేలతో సమావేశం నిర్వహించి వారందరిదగ్గర మూడు తెల్లకాగితాలపై సంతకాలు తీసుకున్నట్లు తెలుస్తోంది. దీనిలో ఒకటి పళనిస్వామిని సీఎంను చేయడానికి, రెండోది తనను పార్టీ ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకోవడానికి, మూడోది అమ్మ ఆరోగ్యం బాగు చేయడానికి ఆసుపత్రి వర్గాలు బాగా కృషి చేసాయని చెప్పడానికి. తెరవెనుక శశికళ ఆడుతున్న నాటకాన్ని పసిగట్టిన వెంకయ్య అప్పటికప్పుడు ప్రధానితో సంప్రదించి తమిళ ప్రజలకు, తమకు అనుసంధానంగా ఉండే పన్నీర్‌సెల్వంను సిఎంగా ఎంపికచేయడంలో చురుకైన పాత్ర పోషించారు. తమిళనాడు ఇన్‌ఛార్జ్ గవర్నర్‌గా వున్న మరో తెలుగువాడు విద్యాసాగర్‌రావు కూడా వెంకయ్యకు ఈ రాజకీయ పరిస్థితుల్లో బాగా సహకరించారు.



# బీజేపీ ఓట్ల కుండకు...
# నరేంద్రుడి తూట్లు

**భారతదేశం అమెరికాలాగా అభివృద్ధి చెందాలని భారత ప్రజలు కోరుకుంటారు. కాని తాము మాత్రం అమెరికన్ పౌరుల్లాగా క్రమశిక్షణతో, దేశం పట్ల బాధ్యతతో ఉండాలను కోరు. భారత రాజకీయాలలో గాని, దేశ ప్రజల్లోగాని ఆలోచన వేరుగా ఆచరణ వేరుగా ఉంటుంది. దేశంలో అవినీతి పేట్రేగిపోతుందని ఆక్రోశిస్తారు. తమకు అవసరం పడ్డ పని వచ్చేటప్పటికి అదే అవినీతిని ప్రోత్సహిస్తారు. అపరిచితుడు, భారతీయుడు, శివాజీ, మల్లన్న, ఠాగూర్ వంటి అవినీతికి, నల్లధనానికి వ్యతిరేకంగా తీసిన సినిమాలను అదే ప్రజలు సూపర్‌హిట్ చేస్తారు. ఆ సినిమాలలో చూపించిన విధంగానే నల్లధనాన్ని అరికట్టే చర్యలు చేపడితే మాత్రం అసహనం వ్యక్తం చేస్తారు. ఇదే భారత దేశం.**

ఈ దేశాన్ని 60ఏళ్ల పాటు పాలించిన కాంగ్రెస్‌పార్టీ గాని, పదేళ్ల పాటు పరిపాలించిన ఇతర ప్రభుత్వాల ప్రతినిధులు గాని నల్లధనం వెలికితీయాలని, అవినీతిని అరికట్టాలని ఎప్పుడూ తొందర పడలేదు. ఈ దేశ రక్తంలో అవినీతి, నల్లధనం అనే విషం ఎప్పుడో కలిసిపోయిందని, ఎన్ని సైన్స్ పరిశోధనలు జరిపినా భారతీయ రక్తం నుండి ఈ విషాన్ని వేరుచేయడం కష్టమని వారికి తెలుసు. ఒకవేళ ఆ ప్రయోగం వికటిస్తే భారత ఆర్థిక వ్యవస్థ అనే పేషంట్‌కే ప్రమాదం. పేషంట్ ప్రమాదంలో పడితే ప్రజలు ప్రభుత్వం మీదే తిరగబడే అవకాశముంది. ఈ ప్రమాదాన్ని పసిగట్టబట్టే గత ప్రభుత్వాలేవీ కూడా నల్లధనాన్ని కఠినంగా అరికట్టే చర్యల జోలికి పోలేదు. ఎందుకంటే నల్లధనం లేనిదే భారత మార్కెట్ నడవలేనంతగా దేశ ఆర్థిక వ్యవస్థ తయారైంది. అయితే గతంలో ఏ ప్రధాని కూడా చేయలేని సాహసానికి ప్రధాని నరేంద్ర మోడీ శ్రీకారం చుట్టారు. దేశంలో అవినీతిని నిర్మూలించి, నల్లధనాన్ని వెలికితీసిన మొనగాడిగా చరిత్రలో నిలిచిపోయేందుకు పెద్దనోట్లు రద్దు మార్గం పట్టాడు. తనను ప్రధాని పీఠం ఎక్కించిన పార్టీ వర్గాలతోగాని, తన సహచర మంత్రులతోగాని ఏ మాత్రం చర్చించకుండానే ఆయన హఠాత్తుగా ఈ నిర్ణయం తీసుకున్నాడు. పెద్దనోట్ల రద్దు తర్వాత నిఖార్సయిన ఆదాయం మాత్రమే బ్యాంకుల్లో జమపడుతుందని, గుట్టలుగా పోగయిన నల్లధనం బ్యాంకుల దాకా రాదని, ఆ డబ్బంతా కేంద్రప్రభుత్వం కొత్తగా ముద్రించుకోవచ్చునని, తద్వారా పేదరిక నిర్మూలనకు అనేక కార్యక్రమాలు చేపట్టొచ్చునని ప్రధాని ఆశించారు. అయితే ఆయన అనుకున్నదొక్కటి... అవుతున్నదొక్కటి! నగదు డిపాజిట్లకు 50రోజులు గడువు ఇవ్వడమే నల్లధనం వున్న వారికి వరంగా మారింది. దేశంలో లెక్కకుమించి నల్లధనం వున్నోళ్లు 5శాతం మంది వుంటే, మిగిలిన 95శాతం మంది కూడా లెక్కకు సరిపడా నగదు, లేదా అసలు బ్యాంకు అకౌంట్లలో డబ్బులు లేనివాళ్లే! ఈ 50రోజుల గడువు మూలంగా డబ్బున్న వాళ్లు తమ అనుచరులు, బంధువులు, ముఖ్యుల ఖాతాలలో తమ డబ్బు జమ చేసుకుని దానిని తెల్లధనంగా మార్చుకున్నారు. మరికొందరైతే స్థిరాస్థులు కొనుగోలు చేయడం, బంగారం కొనడం చేయగా, ఇంకొందరు బ్యాంకులకు వచ్చిన కొత్త నోట్లను కమిషన్ పద్ధతిలో మార్చేసుకున్నారు. ఈ నేపథ్యంలో ఇప్పటికే బ్యాంకులకు పెద్దనోట్లు చాలావరకు చేరిపోయాయి. కేంద్రం నాలుగైదు లక్షల కోట్లు దాకా బ్లాక్ మనీ బ్యాంకుల దాకా రాకపోవచ్చునని ఆశిస్తే, పరిస్థితి మాత్రం అందుకు భిన్నంగా వుంది. ప్రధాని ఆశించినంత స్థాయిలో బ్లాక్‌మనీ నిలబడకపోతే, దేశంలో వున్న పెద్దనోట్లన్నీ కూడా బ్యాంకుల్లో గుట్టలుగా పడిపోతే కేంద్రం నిస్సహాయ స్థితిలో పడుతుంది. దీనివల్ల లాభంకన్నా ఈ రెండు నెలల మార్కెట్ నష్టమే అధికంగా ఉంటుంది.

ఇప్పుడు మోడీ చేపట్టిన బ్లాక్‌మనీ ఆపరేషన్ వికటించే పరిస్థితుల్లో వుంది. నెలరోజులుగా ప్రజలు క్యూలలో వుంటున్నారు. అయినా ఇంతవరకు ఆర్థిక వ్యవస్థ తేరుకోలేదు. ప్రజలకు తగినంత నగదు అందించడంలో వైఫల్యాలు ఎదురవుతూనే వున్నాయి. దేశం కోసం ఈ 50రోజులు కష్టపడండని, త్యాగాలు చేయండని ప్రధాని కోరుతున్నారు. ఈ 50రోజుల తర్వాత దేశ ఆర్థిక వ్యవస్థ కోలుకుంటుందనే నమ్మకం కూడా లేదు. ఇప్పటికే చాలా కంపెనీలు దివాళా స్థితిలో వున్నాయి. ఒక్కో కంపెనీ నుండి వేలమంది ఉద్యోగాలు ఊడి బయటకొస్తున్నారు. ఇక రియాల్టీ రంగాన్ని దారుణంగా దెబ్బతీయడంతో లక్షలాది మంది ఉపాధి కోల్పోతున్నారు. వీరందరినీ మోడీ ప్రభుత్వం ఏ విధంగా ఆదుకుంటుందో చూడాలి.

ఇక రాజకీయంగా చూస్తే 'పెద్దనోట్లు రద్దు' నిర్ణయం సత్ఫలితాలనిస్తే ప్రధానిగా అది నరేంద్రమోడీ ఇమేజ్‌ను పెంచుతుంది. వికటిస్తే మాత్రం బీజేపీని దారుణంగా దెబ్బతీస్తుంది. అయితే మోడీ వ్యక్తిగతంగా తీసుకున్న నిర్ణయానికి పార్టీ మూల్యం చెల్లించాల్సి రావడమే ఇక్కడ విపరీత పరిణామం. బీజేపీ కాంగ్రెస్‌లా కుటుంబ పార్టీ కాదు. వాజ్‌పేయి, అద్వానీలు ఈ పార్టీ పిల్లర్స్. వాళ్లు ఒక్కో ఇటుక పేర్చుకుంటూ పార్టీని ఈ స్థాయికి తీసుకొచ్చారు. ముఖ్యంగా పార్టీ 2 సీట్ల నుండి 200 సీట్లకు పెరగడంలో సీనియర్ నేత అద్వానీ పాత్ర విస్మరించలేనిది. పార్టీని ఈ స్థాయికి తీసుకొచ్చిన అద్వానీ కాకుండా నరేంద్ర మోడీ ప్రధాని కాగలిగాడంటే కారణం అది కాంగ్రెస్‌లా కుటుంబ పార్టీ కాకపోవడమే! ఈ పార్టీకి కొన్ని వర్గాలను ఓట్లు బ్యాంకులుగా మలచడంలో సీనియర్ నేతలు ఎంతో కష్టపడ్డారు. ముఖ్యంగా మధ్యతరగతి ప్రజలు బీజేపీకి బాసటగా నిలుస్తున్నారు. అలాగే వ్యాపారులు, అగ్రవర్ణాలలోని కొన్ని కులాలు పార్టీకి అండగా ఉంటున్నాయి. ఇటీవలకాలంలో పెద్ద కార్పొరేట్ కంపెనీలు, పారిశ్రామికవేత్తలు కూడా కాంగ్రెస్‌ను వదిలి బీజేపీవైపే కదిలారు. ఇప్పుడు పెద్దనోట్ల రద్దుతో ఎక్కువగా ప్రభావితమవుతుంది బీజేపీ అనుకూల వర్గాలే! వీరంతా కూడా పార్టీకి దూరమయ్యే అవకాశముంది.

మరి పెద్ద నోట్ల రద్దు వల్ల ఏ వర్గాలకైతే మోడీ ప్రయోజనం కలిగించాలనుకుంటున్నాడో, వాళ్లు బీజేపీకి దగ్గరయ్యే అవకాశాలు లేవు. దళితులు, మైనార్టీలు ఇప్పటికే ఎక్కువగా కాంగ్రెస్, ఆయా ప్రాంతీయ పార్టీల వైపే వున్నారు. బీజేపీ మీదున్న సామాజిక వ్యతిరేక వైఖరి వల్ల వాళ్లు ఆ పార్టీకి దగ్గర కారు. ఈ లెక్కన చూస్తే మోడీ చర్య బీజేపీకి రాజకీయంగా లాభం కంటే నష్టమే ఎక్కువ కలిగించనుందని చెప్పొచ్చు!

# కొనసాగుతున్న...విజయయాత్ర

- దిగ్విజయంగా కక్ష్యలోకి రిసోర్స్‌శాట్-2 ఏ
- అభయహస్తం ఇచ్చిన 'రైతు నేస్తం'

భూమిపై వ్యవసాయ రంగానికి సంబంధించి అత్యుత్తమ సేవలందించే లక్ష్యంతో భారతశాస్త్రవేత్తలు ప్రయోగించిన పిఎస్‌ఎల్‌వి-సి36 ప్రయోగం దిగ్విజయమైంది. ఈ ఉపగ్రహ ప్రయోగంతో మనదేశ వ్యవసాయరంగానికి మేలుబాటలు పరచినట్లే. ఉపగ్రహ ప్రయోగాల్లో భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) విజయపరంపర దిగ్విజయంగా కొనసాగుతోన్న నేపథ్యంలో తాజాగా ఈ ప్రతిష్టాత్మక విజయాన్ని సాధించిన భారతశాస్త్రవేత్తలను ప్రజలందరూ అభినందిస్తున్నారు. 'రైతన్నల నేస్తం'గా భావించే ఈ ఉపగ్రహం భూమికి 887 కిలోమీటర్ల ఎత్తులో గగనవీధుల్లో సంచరిస్తూ భూమికి సంబంధించిన సమస్త సమాచారాన్ని, తెలుపుతుంది. భూములు, నదులు, కాలువలు, పంటలు, సరస్సుల స్థితిగతులను ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు సహకరిస్తుంది. సముద్ర ప్రాంతాలు, దట్టమైన హిమ ప్రాంతాల వాతావరణాన్ని కూడా అధ్యయనం చేసి అందుకు సంబంధించిన ముఖ్యమైన సమాచారాన్నంతా వివరిస్తుంది. అంతేకాదు, వ్యవసాయరంగానికి సంబంధించిన భూములు, జలవనరుల సమాచారాన్ని సమగ్రంగా తెలియజేస్తుంది. నేల రకాలపై సమాచారాన్నిస్తుంది. దిగుబడులు పెంచుకునేందుకు అన్నదాతకు అనువైన మార్గనిర్దేశనం చేస్తుంది. మొత్తమ్మీద ఈ సమాచారమంతా మనదేశ వ్యవసాయ రంగానికి ఎంతో ఉపకరిస్తుందని నిర్ద్వంద్వంగా చెప్పవచ్చు. ఈ ఉపగ్రహం బరువు 1235 కిలోలు వుంటుంది. అంత బరువున్న రిసోర్స్ శాట్-2ఏని ఇస్రో శాస్త్రవేత్తలు పిఎస్‌ఎల్‌వి రాకెట్‌ద్వారా అంతరిక్ష కక్ష్యలోకి విజయవంతంగా ప్రవేశపెట్టడంతో ఇస్రో కీర్తికిరీటంలో ఈ విజయం మరో మణిమకుటమైంది. బుధవారం ఉదయం సరిగ్గా 10.25 గంటలకు శ్రీహరికోటలోని అంతరిక్షకేంద్రం షార్ నుంచి పిఎస్‌ఎల్‌వి-సి 36 రాకెట్ నిప్పులు చిమ్ముతూ నింగిలోకి దూసుకువెళ్ళింది. ఈ ప్రయోగం విజయవంతం కావడంతో ఇస్రో ఛైర్మెన్ కిరణ్‌కుమార్ శాస్త్రవేత్తలందరినీ అభినందించారు. వచ్చే ఏడాదిలో మరిన్ని అద్భుతమైన ప్రయోగాలను ఇస్రో చేపట్టనుందన్నారు.

కాగా, రాకెట్ విజయం పట్ల హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తూ దేశవ్యాప్తంగా ప్రజలు, ప్రముఖులు ఇది చరిత్రాత్మక విజయమంటూ ఇస్రో శాస్త్రవేత్తలను కొనియాడారు. ఇది గొప్ప విజయమని, మనందరికీ ఈ విజయం గర్వకారణమని ఇస్రో బృందాన్ని




భారత ప్రధాని నరేంద్రమోడీ ప్రత్యేకంగా అభినందించారు. ఇదిలావుంటే, ఈ ప్రయోగంతో షార్ నుంచి ఇస్రో ఇప్పటికి 57 ప్రయోగాలను పూర్తిచేసినట్లయింది. ఈ ప్రయోగాల్లో అత్యధిక శాతం విజయాలే లభించడం, ఇందులో 37 ఘనవిజయాలు పిఎస్‌ఎల్‌వి రాకెట్ల ద్వారానే కావడం విశేషం.

## రైతులకెంతో ప్రయోజనం :

ఈ భూమిపై ఏ మేరకు జలవనరులు వున్నాయో సమగ్రంగా తెలుసుకునేందుకు, తద్వారా రైతన్నలకు ప్రయోజనం కల్పించేందుకు ఈ ఉపగ్రహం ఎంతగానో తోడ్పడుతుంది. ఈ ఉపగ్రహం సేవలు అందుబాటులోకి వస్తే, భూముల విస్తీర్ణం, వ్యవసాయరంగంలో భూములు ఏవిధమైన పంటలకు ఉపయోగపడతాయి, పంటల విస్తీర్ణం ఎంత, అవి ఏ వరుస భూములు, అందులో ఎలాంటి పంటలు వేసుకోవచ్చు, ఒకవేళ పంటలకు తెగుళ్ళు వంటివి వస్తే వాటి పరిస్థితి ఏమిటి, పంటల దిగుబడులు ఎలా వుంటాయి వగైరా విషయాలన్నీ స్పష్టంగా తెలుసుకోవచ్చు. కరువు ప్రాంతాల పట్ల పర్యవేక్షణకు, పట్టణ ప్రణాళిక, రక్షణ రంగాలకు కూడా ఇది ఎంతగానో ఉపయోగపడుతుంది. మొత్తమ్మీద 'రైతునేస్తం'గా అందరూ భావించే ఈ అధునాతన ఉపగ్రహాన్ని భారత శాస్త్రవేత్తలు విజయవంతంగా బుధవారం కక్ష్యలోకి పంపి అందరి ప్రశంసలు అందుకున్నారు. మనదేశం పంపిన రిసోర్స్ శాట్ ఉపగ్రహాల్లో ఇది మూడవది. రిసోర్స్‌శాట్-2 జీవితకాలం ముగుస్తుండడంతో, దాని స్థానంలో ఇప్పుడు ఈ రిసోర్స్‌శాట్-2 ఏని పంపారు.

# నగదు కష్టాల నుండి గట్టెక్కిద్దాం

**- మంత్రి సిద్ధా**



ప్రజలను కరెన్సీ కష్టాల నుండి గట్టెక్కించే వరకు జిల్లా ఉన్నతాధికారులు, బ్యాంకుల సిబ్బంది బాధ్యతాయుతంగా పని చేయాలని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి సిద్ధా రాఘవరావు సూచించారు. ఈనెల 7వతేదీన నెల్లూరు కలెక్టరేట్‌లోని గోల్డెన్‌జూబ్లీ హాల్‌లో ఆయన వివిధ శాఖల అధికారులు, బ్యాంకర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. నగరంలో పలు బ్యాంకుల వద్ద బారులు తీరి 'క్యూ'లలో వున్న ప్రజలను తాను చూసానని, వారి కష్టాలను మన కష్టాలుగా భావించి కరెన్సీ సమస్య తీరుద్దామన్నారు. క్యూలలో నిలబడివున్న ప్రజలకు ఓపికగా సమాధానం చెప్పండని సూచించారు. ఇక ఈ సమావేశంలో నగదు రహిత లావాదేవీలపై జరుగుతున్న అవగాహనా కార్యక్రమాలను గురించి జేసీ ఇంతియాజ్‌అహ్మద్ వివరించారు. నగదు కొరత గురించి లీడ్‌బ్యాంకు మేనేజర్ వెంకట్రావు చెప్పుకొచ్చారు. ఉద్యోగుల జీతాలు వారి అకౌంట్లలో వేసి ఒకొక్కరికి 10వేలు ఇచ్చామని కలెక్టర్ ముత్యాలరాజు చెప్పారు.

ఈ సమీక్షా సమావేశంలో ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, జేసి-2 రాజ్‌కుమార్, డిఆర్‌డిఏ పిడి హరిత, హౌసింగ్ పి.డి రామచంద్రారెడ్డి, పర్యాటక శాఖ ఇ.డి చంద్రమౌళి, ఇరిగేషన్ ఎస్.ఇ కోటేశ్వరరావు తదితరులు పాల్గొని తమ శాఖల బాధలు చెప్పుకున్నారు.

Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com